జరుగవలసిన హత్య

సికిందర్

లాల్ ఆఫీసులోకడుగు పెడుతూ, విసుక్కుంటున్న జాన్ ని చూసి, "వాట్ హేపెండ్? ఏమిటా అవతారం?" అన్నాడు.

"నాక్కోపం వస్తోంది, లాల్!"

"ఎందుకొస్తోంది?"

"ఇతను—ఈ పార్టీ ఎవరో వేధిస్తున్నాడు నన్ను? నిమిషానికోమారు ఫోన్ చేస్తూ చంపుతున్నాడు! పేరు చెప్పడు, పని చెప్పడు, నువ్వే కావాలట, నీతో తప్ప మాట్లాడడట. అయితే నువ్వొచ్చేవరకూ ఆగమంటే వినడు. నువ్వొచ్చాక నేనే పిలుస్తాను నెంబరివ్వమంటే ఇవ్వడు. అరగంటలో తొమ్మిదిసార్లు పిలిచాడు—నువ్విప్పుడు రాకపోతే—నేనేం చేసే...."

"ఎలా వున్నాడతను?"

"నాకేం తెలుసు? నాకు దివ్యదృష్టి వుందా?"

"ముందు ముఖం దివ్యంగా వుంటేగా? నేననేది

కంగారుగా వున్నాడా అని—"

"ఉన్నట్లే తోచాడు."

"గొంతెలా వుంది?"

"బర్ర గొంతు, కరకరలాడాడు, మరమరాలు తింటున్నట్టు."

"ఎక్కణ్నుంచి పిలుస్తున్నాడు — ఇంటినుంచా? ఆఫీసు—"

"ఇంటినుంచే."

"ఎలా అంటున్నావు?"

"నాలుగోసారి, ఆ తర్వాత ఆరోసారి ఫోన్ చేసినప్పుడు ప్రక్కనుంచి మరో గొంతు కూడా విన్పించింది. ఆడ గొంతు. అతని భార్య గొంతు. అంటే ఇంటినుంచే కదా? ఆమె అభ్యంతరం పెడుతోంది? వద్దండీ, మనకీ పోలీసులూ, డిటెక్టివ్‌లూ వద్దు, నా మాట వినండి.... అంటూ. కానీ అతను విన్పించుకోవటంలేదు, మొండిగా చేస్తూనే వున్నాడు ఫోన్."

లాల్ కూర్చుంటూ అన్నాడు. "వెల్, భార్యకిష్టంలేని పని చేస్తున్నాడన్నమాట!"

జాన్ తలవూపాడు, "చాలామంది చేస్తారు."

"కొన్నిసార్లు చింతిస్తారు."

"చింతించే హక్కు ఎవరికైనా వుంది లోకంలో."

"నీకు లేదు ఈ ఆఫీసులో! ముఖం తిన్నగా పెట్టుకో! మన ఏజన్సీ బాగుపడాలంటే శాంతం, సహనం అవసరం యూ ఫూల్!"

ఫోన్ మోగింది.

లాల్ ఫోన్ ఎత్తి, "యస్, లాల్ హియర్" అన్నాడు మృదువుగా, "నా పార్టనర్‌ని విసిగిస్తున్నది

మీ రేనా?"

"అవును. అయాం సారీ, మిస్టర్ లాల్...."

"నెవర్ మైండ్. మీరు మరొక్కసారి పిలిచివుంటే నా పార్ట్‌నర్ పారిపోయేవాడు. ఆ తర్వాత పేపర్లో ప్రకటన వేయించవలసి వచ్చేది...."

"షటప్!" కసిరాడు జాన్.

"మిస్టర్ లాల్, నేను డాక్టర్ సురేష్‌ని. మీతో మాట్లాడాలి...."

"మాట్లాడండి."

"ఇలా కాదు. మీతో పర్సనల్‌గా...."

"ఇక్కడకొచ్చేయండయితే."

"అక్కడెవరూ ఉండరుకదా?"

"నా పార్ట్‌నర్ వుంటాడు. అతను నాతో అన్నీ ఫిఫ్టీ-ఫిఫ్టీ పంచుకుంటాడు. మీరేమీ వెనుకాడనవసరం లేదు.

"అయితే వెంటనే వచ్చేస్తున్నాను...." క్లిక్‌మంది అవతల.

లాల్ రిసీవర్ పెట్టేస్తూ, "సురేష్ వస్తున్నాడు, డాక్టర్ సురేష్" అన్నాడు.

"డాక్టర్ సురేష్?" అడిగాడు జాన్.

"యస్, పార్ట్‌నర్. యంగ్ డాక్టర్. కొత్తగా ప్రాక్టీసు పెట్టివుంటాడు, లేదా ఉద్యోగంలో చేరి వుంటాడు. అప్పుడే మొదలయ్యాయి కష్టాలు....అవి వృత్తిపరమైనవో, గృహ సంబంధమైనవో తెలియదు. ఇంట్లో అందమైన భార్య వుందన్నావు కదూ?"

"అవును, నీకెందుకు?"

"అపార్థం, పార్ట్‌నర్, అపార్థం జేసుకోకు. ఆమె

అభ్యంతరం పెడుతుందన్నావు. అంటే కష్టాలు ఆమెవల్ల కాకపోవచ్చు. లేక ఆమె ఏదైనా ఆపదలో ఇరుక్కుని ఇప్పుడిప్పుడే ఇంటికి వచ్చి వుండొచ్చు. ఆ ప్రతీకారంతో శత్రువుమీద అత నిప్పుడు ...”

“ఆమె కేమిటి ఆపద, పార్ట్నర్?”

“వెల్, ఈ కాంపిటీషన్ కైపులో పడి కొందరు కాని పనులు చేస్తుంటారు. ఇప్పుడు డాక్టర్లమధ్య పోటీ ఎంతగా పెరిగిపోయిందో చూస్తూనే వున్నావు. ఎదుటి వాడు బాగుపడుతోంటే కొందరు చూసి ఓర్వలేరు. ఆ ఓర్వలేని తనంతో ఓ మహానుభావుడైన డాక్టర్, తన కాంపిటీటర్ని దెబ్బతీయాలనే తలంపుతో, అతని భార్యని అపహరించి—తిరిగి కొన్నాళ్ళ తర్వాత ఇంటికి పంపి ఆ కాంపిటీటర్ వృత్తినీ, పరువునీ మంటగలిపిన కేసు ఒకటి నేను ప్రత్యక్షంగా చూశాను.”

“ఇది అలాంటి కేసంటావా?”

లాల్ ఏదో అనబోయాడు.

తలుపు దగ్గర అలికిడైంది.

ఇద్దరూ అటువైపు చూశారు. ఓ ముప్పై ఏళ్ళ యువకుడు వేగంగా లోనికొస్తూ అన్నాడు, “హాలో, గుడ్ మార్నింగ్. నేనే డాక్టర్ సురేష్ని. మిష్టర్ లాల్, మీరు సుభాష్ని అరెస్టు చేయాలి!”

“మీరు కూర్చోండి” అన్నాడు లాల్.

అతను కూర్చున్నాడు. లాల్ అతన్ని తేరిపార చూశాడు. “సుభాష్ ఎవరు?”

“వాడొక రౌడీ, క్రూక్, క్రిమినల్! వాడ్ని అరెస్టు చేయండి మీరు!”

“అరెస్టు మేం చెయ్యం. పోలీసులు చేస్తారు.”

"వాళ్ళతో నే చేయించండి! వాడ్ని తక్షణం పట్టుకోండి!"

"ఏం చేశా డతను? ఎక్కడుంటాడు?"

"ఎక్కడుంటాడో తెలియదు. వాడు మా బాబుని కిడ్నాప్ చేశాడు."

"ఐ.సీ.... మీ బాబు కెన్నేళ్ళు?"

"ఎనిమిది నెలల పసివాడు!"

"ఓహ్, ఎప్పుడు జరిగింది కిడ్నాప్?"

"నిన్న సాయంత్రం! బాబు క్షేమంగా దొరికాడు నిన్న రాత్రి!"

"అయితే శుభాంతమైందన్నమాట! మళ్ళీ ఈ కవ్వింపు లెందుకు?"

"తిరిగి నా డబ్బుని రాబట్టుకునేందుకు!"

"ఎంత పోయింది?"

"పదివేలు!"

"కాని ఇది మీ మిసెస్ కిష్టంలేదనుకుంటాను?"

"దాని మొహం, ఆమెకు భయం. ఆమెకు బిడ్డ కావాలి. దక్కాడు. నా కిప్పుడు నా డబ్బు దక్కాలి. ఆమె భయాలు అర్థంలేనివి. బిడ్డ ప్రాణాలకి మోసం లేదిప్పుడు...."

"అసలెలా జరిగింది?"

సురేష్ అన్నాడు. "నిన్న సాయంత్రం నేను క్లినిక్‌లో వున్నాను, మిష్టర్ లాల్. రేవతి ఫోన్ చేసింది అయిదు గంటలకి. విశాల్ — మా బాబు కన్పించటం లేదంది కంగారుపడిపోతూ. మా ఇల్లు అశోక్‌నగర్‌లో వుంది, మిష్టర్ లాల్, క్లినిక్ కవాడిగూడలో. పది నిమిషాల ప్రయాణం నా స్కూటరుమీద. రెండేళ్ళుగా

నేనిక్కడ ప్రాక్టీసు చేస్తున్నాను. వివాహమై కూడా రెండేళ్ళే అయింది. ఇక్కడ మేమిద్దరమే ఉంటున్నాం, మా బాబుతో. ఆమె వాళ్ళూ, నావాళ్ళూ అంతా వరంగల్ లోనే వుంటున్నారు. ఈ సిటీలో మాకెవరూ బంధువులు లేరు."

లాల్ చెప్పమన్నట్టు తలూపాడు.

"నిన్న సాయంత్రం ఫోన్ చేసింది రేవతి, బాబు కన్పించటంలేదని. అప్పుడామె పరిస్థితి ఏడుపొక్కటే తక్కువగా వుంది. వాడ్ని బెడ్ రూంలో పడుకోబెట్టి కిచెన్ లో వుందట తను. కాస్సేపటికి వెళ్ళి చూస్తే అక్కడ లేడట! ఇంట్లో ఎక్కడా లేడంది. ఇల్లు సపరేట్ పోర్షన్, మిస్టర్ లాల్. పొరుగువాళ్ళు వచ్చే అవకాశంలేదు తెలియకుండా. అసలామెకు ఇరుగుపొరుగు పరిచయాలు లేవు. ఇంట్రోవర్టు, మిస్టర్ లాల్. తనేమిటో, తన పనేమిటో, ఆమె తత్వమే అంత.

"విశాల్ కింకా ప్రాకటంరాదు. కాస్త మొద్దురకం. నాలాగే బద్ధకస్తుడవుతాడని బెంగగావుంది. ఇంట్లోకెలా ఎవరొచ్చి వాడ్ని తీసుకుపోతారు చెప్పకుండా? ఇంటి కెవరూ రారు రేవతి వున్నప్పుడు. నేనున్నప్పుడు మాత్రం పక్కింటాయన వస్తూంటాడు. మరి బాబుని ఎవరు తీసుకుపోతారు? ముందు తలుపు లోపలినుంచి గడియపెట్టిందట. అయితే బెడ్ రూంకి తోటలోకి తెరుచుకునే కిటికీవుంది. అది తీసే వుంటుంది. దానికి వూచల్లేవు. మనిషి రావచ్చు. ఆ కిటికీ తప్ప బాబు పోయే మార్గమేలేదు!"

"అప్పుడు మీరేం చేశారు?" అడిగాడు లాల్.

"రేవతి మాటలు విని నేను వెంటనే వెళ్ళడానికి సిద్ధమయ్యాను. ఇంతలో మళ్ళీ ఫోన్ మోగింది. చేసిం

బెదరనుకున్నారు—బాబు నెత్తుకుపోయిన వాడే!"

"ఎవడా రోగ్?"

"మాటలమధ్య తన పేరు సుభాష్ అని చెప్పాడు. నాకు బాగా కావలసినవాడేనని కూడా చెప్పాడు. నాకు మండుకొచ్చింది. వాడి పరిహాసానికి. ఆ పేరుతో నా కెవరూ తెలియదు. బాబు క్షేమంగా తిరిగిరావాలంటే తను కోరిన డబ్బివ్వమన్నాడు. పదివేలు కావాలన్నాడు. రాత్రి పదిగంటలకల్లా ముట్టజెప్పాలన్నాడు.

"డబ్బు బ్రీఫ్ కేసులో పెట్టుకొని—అన్నీ వందనోట్లు కోరి బస్ టెర్మినస్‌కు రమ్మన్నాడు. బ్రీఫ్ కేసుని బుకింగ్ కౌంటర్ దగ్గర కింద పెట్టేసి, అక్కడే కిందపడుండే ఒక ఖాళీ చార్మినార్ సిగరెట్ పెట్టి అందుకోమన్నాడు. దానిలో సిగరెట్లుండే అట్టమీద బాబు ఎక్కడుంటాడో తెలిపే ఇన్ఫర్మేషన్ వ్రాసి వుంటుందన్నాడు. దాన్ని చదువుకొని చింపేసి, వెంటనే బయల్దేరితే, ఆ బ్రీఫ్ కేసులో డబ్బు సరిగ్గా వుంటే, అప్పుడు బాబు దొరుకుతాడన్నాడు. లేకపోతే లేదట."

"వెల్, మీరేం చేశారు?"

"అలాగే చేశాను. బ్యాంకుకు వెళ్ళి డబ్బు డ్రా చేసుకుని ఇంటికెళ్ళాను. ఆ నోట్ల నెంబర్లన్నీ వ్రాసుకున్నాను. ఆ లిస్టు ఇదుగో తెచ్చాను....పది గంటలకి అక్కడకెళ్ళాను. బ్రీఫ్ కేసు అక్కడే పెట్టేసి, సిగరెట్ పెట్టి అందుకున్నాను. దానిమీద 'కాచిగూడ రైల్వే స్టేషన్-వెయిటింగ్ రూం' అని వ్రాసి వుంది తెలుగులో. ఇంకా అక్కడ బాబు ప్రక్కనే ఒక సూట్ కేసు వుంటుందని, దాన్నీ బాబునీ తీసుకుని బయటకొచ్చేసి నేను స్కూటర్ నిలిపిన చోటులో ఆ సూట్ కేసును

వదిలేసి, బాబుతో వెళ్ళిపొమ్మన్నాడు.

"కానీ బాబు నెత్తుకొని స్కూటర్ నడపలేనని వాడికి తోచివుండదు.

"నే నాటోలో వెళ్ళి పని పూర్తిచేసుకొచ్చాను. ఆ ఆటో నెంబర్లు నోట్ చేసుకున్నాను, ముందు నాకు సాక్ష్యానికి పనికొస్తాయని. మొత్తం మూడు ఆటోలు మారాను. ఆ నెంబర్లు ఇవిగో....అక్కడ వెయిటింగ్ రూంలో బాబు సోఫామీద నిద్రపోతున్నాడు. వాడికి నిద్రమాత్ర వేశారు. వాణ్ని తీసుకుని నేను వాడు కోరినట్టే చేసి వచ్చేశాను."

"ఆ తర్వాత ఏం జరిగింది.

"ఏమీ లేదు. ఇంటికొచ్చేశాను. బాబుని చూసి రేవతి తేలికపడింది. కానీ నా మనసు మనసులో లేదు. అంత డబ్బు పోయింది! నే కష్టపడి సంపాదించింది...."

ఫోన్ మోగింది అంతలో.

జాన్ రిసీవర్ ఎత్తి రెస్పాన్స్ ఇచ్చి, అవతలి మాటలు ఆశ్చర్యంగా విని, "అలాగే!" అని పెట్టేశాడు. లాల్ ఏమిటన్నట్టు చూశాడు.

జాన్ చెప్పాడు. "మిసెస్ సురేష్‌నుంచి ఫోన్ వచ్చింది. ఆమెకు కిడ్నాపర్ ఫోన్ చేశాడట. వాడు మిస్టర్ సురేష్‌ని కనిపెడుతున్నాడట. తక్షణం ఆయన తన ప్రయత్నాలు మానుకోకపోతే ప్రాణాలతో వుండడట...."

2

లాల్ సిగరెట్ వెలిగించి గట్టిగా నాలుగు దమ్ములు లాగాడు. "ఓహో, అయితే నా వూహ తప్పయిందన్న

మాట!"

"ఏమిటి మీ వ్యూహం?" వెంటనే అడిగాడు సురేష్.

"వాళ్ళెప్పుడో రాత్రికే రైలెక్కి చెక్కేశారనుకున్నాను."

"వాళ్ళుంటున్నారు—అంటే కిడ్నాపర్స్ ఇంకొందరున్నారా?"

"ఉండాలి, తప్పదు. కనీసం ఇద్దరు. అప్పుడే నెరవేరుతుంది. నెంబర్ వన్ — కోఠి బస్ టెర్మినస్ దగ్గర మీనుంచి డబ్బు రిసీవ్ చేసుకుంటాడు. నెంబర్ టూ—కాచిగూడ రైల్వేస్టేషన్‌లో మీ బాబుని మీకు డెలివరీ ఇస్తాడు. బాబుని మీరు ఫలానాచోట పొందవచ్చునని మీకు ముందే చెప్పలేదు. అలా చెప్తే మీకు ఆలోచనలు రావచ్చు. కాబట్టి డబ్బు మీరు డెలివరీ చేసేవరకూ అది మీకు తెలియకుండా వుంచారు. ఆ బస్ టెర్మినస్ దగ్గర మాత్రమే మీ కా సిగరెట్ పెట్టిలో ఇన్ఫర్మేషన్ దొరికింది. కాబట్టి ఆ క్షణంలో మీరు వాళ్ళకి వ్యతిరేకంగా ఏం చేయడానికీ వీలుండదు. డబ్బక్కడ పడేసి బాబుకోసం తిన్నగా వెళ్ళటమే.

"వెల్, అక్కడ డబ్బుకోసం వేచివున్న నెంబర్ వన్ అది సరిగ్గా వుందో లేదో చూసుకొని, అప్పుడు నెంబర్ టూకి ఫోన్ చేస్తాడు; బాబుని డెలివరీ ఇవ్వొచ్చనీ, డబ్బు సక్రమంగా వుందనీ. అప్పుడా నెంబర్ టూ బాబుని మీకు చెప్పినచోట వదిలి తప్పుకుంటాడు. కానీ మిమ్మల్ని గమనిస్తూనే వుంటాడు. మిమ్మల్ని సూట్‌కేసుతో బయటికి వెళ్ళమనడంలోని ఆంతర్యం, ఎవరికీ అనుమానాలు రాకుండా మిమ్మల్నొక ప్రయాణికుడుగా కనిపింపజేయడం.

"ఆఫ్ కోర్స్, తనకి కూడా వెయిటింగ్ రూంలో ప్రవేశానికి ప్రయాణీకుడిగా అగుపించే అగత్యం ఏర్పడి వుంటుంది, సూట్ కేసుతో వచ్చాడు. లేక అక్కడ్నుంచే తన పలాయనానికి దాన్ని తెచ్చుకొని వుంటాడు. వెల్, మీ రా సూట్ కేసు, మీ బాబుతో బయటికొచ్చేశారు. సూట్ కేసు అక్కడ పడేసి ఆటో ఎక్కేశారు. అప్పుడా సూట్ కేసును నెంబర్ టూ స్వాధీనం చేసుకున్నాడు. అందులో ఏముందనుకున్నారు?"

"ఏమో.... అది మాత్రం బరువుగా వుంది."

"వాళ్ళ సామాను ప్రయాణానికి. కోఠినుండి డబ్బుతో నెంబర్ వన్ రాగానే నెంబర్ టూతో కలిసి ట్రైన్ ఎక్కేశారనుకున్నాను. కానీ వాళ్ళిద్దరు—లేదా వాళ్ళలో ఒక్కడు — ఇంకా యిక్కడే వున్నాడని ఈ ఫోన్ కాల్ వల్ల తెలుస్తోంది.... నెంబర్ టూ ఇక్కడే రైలు ఎక్కేసి వుంటాడు రాత్రి...."

"ఇప్పుడు నన్నేం చేయమంటున్నారు?"

"కిడ్నాపర్ హెచ్చరిక విన్నారు. ఇప్పటికీ మీకా డబ్బు కావాలా?"

"కావాలి! ఆ డబ్బు నా కష్టార్జితం! నేనింత తేలిగ్గా డబ్బు పోగొట్టుకొనే ఫూల్ ని కాను!"

"మీ ప్రాణం సమస్య—మీవాళ్ళు సఫరవుతారు."

"నా ప్రాణానికేం ఢోకాలేదు!"

"అయితే మీరు ఇంటికి బయల్దేరండి."

"బయల్దేరి—?"

"రాత్రి మీరు స్టేషన్ కే డ్రస్సులో వెళ్ళారో అదే డ్రస్సు వేసుకోండి. బాబుని ఇంటికి తెచ్చినప్పుడు అతడే దుస్తుల్లో వున్నాడో సరిగ్గా అవే తొడిగించండి. అప్పుడు

వెంటనే మీ మిసెస్‌నీ, బాబునీ తీసుకొని ఆటోలో ఆ స్టేషన్‌కి చేరుకోండి. వెంట ఓ సూట్‌కేసు వుంచుకోండి."

"ఎందుకు? ఇదంతా ఎందుకు?"

"చెప్తాను. స్టేషన్ కెళ్ళి మీకు తోచిన ఏదైనా దగ్గరి ఊరికి టికెట్లు తీసుకోండి. అప్పుడు వెయిటింగ్ రూంలో నాకోసం ఎదురుచూస్తూండండి. నేనొస్తాను. మీరెంత సమయం తీసుకుంటారు దీనికి?"

"అర—ముప్పావుగంట!"

"గుడ్, మీకంటే ముందే నేనక్కడుంటాను. మీరిక బయల్దేరండి. మీరేం భయపడకండి. కొంచెం రిస్కు తీసుకోవాలంతే."

సురేష్ లేచాడు. "నాకేం భయంలేదు, అలాగే చేస్తాను."

"జాగ్రత్త, బయట మీకోసం కనిపెట్టుకునుండవచ్చు. మీరు భయపడుతున్నట్లు, బెదిరిపోయినట్లు కనిపించాలి. మిమ్మల్ని చూస్తే తన హెచ్చరిక విని ప్రయత్నం మానుకొని ఇంటి ముఖం పడుతున్నట్లు అన్పించాలి. మీరు స్టేషన్‌కి వెళ్తోంటే తన హెచ్చరిక అప్పటయి పోయి ఊరికెళ్ళి పోతున్నట్లు అనుకోవాలి. మిమ్మల్ని వెంటాడిరావచ్చు. ఏదైనా వాహనం వెంటాడుతున్నట్లు తోస్తే దాని నెంబరు గుర్తుపెట్టుకోండి—ఓ.కే?"

సురేష్ తలూపి బయటికి దారితీశాడు. అతను వెళ్ళి పోయాక లాల్ సిగరెట్ తాగుతూ నిశ్శబ్దంగా వుండి పోయాడు కొన్ని క్షణాలు.

ఆ తర్వాత జాన్ వైపు తిరిగి అన్నాడు. "నువ్వు కోఠి బస్ టెర్మినస్‌కి."

జాన్ లేచాడు. "అలాగే, సర్. తమరు సీక్రెట్

మిషన్ మీద పోతున్నారు కాబట్టి, కారు నేను తోలుకు పోతాను. ఏమంటారు, సర్?" అన్నా డతను వంగి వినయంగా.

3

లాల్ ఆటోలోనే ఫేర్ చెల్లించేసి, కిందకి దూకి పరుగెత్తాడు బ్రీఫ్ కేసుతో స్టేషన్ లోకి.

కౌంటర్ లో ప్లాట్ ఫాం టికెట్ కొనుక్కుని, గబగబా వెళ్ళాడు ప్లాట్ ఫాం మీదకి. జనంతో కిటకిటలాడిపోతోంది. అతను వెనుకా ముందూ చూడకుండా, జనాన్ని తోసుకుంటూ తిన్నగా వెయిటింగ్ రూంలో కెళ్ళిపోయాడు.

అక్కడా జనంతో నిండుగా వుంది. సీట్లన్నీ ఆక్రమించుకున్నారు. లాల్ ఆ సమూహాన్ని జాగ్రత్తగా కలయజూస్తూ, తెలిసిన ముఖాలు లేకపోయేసరికి, సిగరెట్ వెల్గించుకు తిరిగి బయటి కొచ్చేశాడు.

గబగబా ఎంట్రెన్స్ దగ్గరకొచ్చి నిలబడి బయట ఆవరణలోకి చూడసాగాడు. ఎన్నో వాహనాలు వచ్చి ఆగుతున్నాయి, పోతున్నాయి. అయిదు నిమిషాలు ఎదురు చూశాక ఒక ఆటోలోంచి దిగారు సురేష్ వాళ్ళు. లాల్ వెంటనే చాటుకి నక్కి నిలబడి చూడసాగాడు. ఆ ఆటో వెనుక మరే వాహనమూ రాలేదు. వాళ్ళు లోపల కొస్తున్నారు.... కౌంటర్ లోకెళ్ళి సురేష్ టికెట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత వాళ్ళు ప్లాట్ ఫాంమీదకి వెళ్ళిపోయారు.

కాస్సేపాగి లాల్ వెళ్ళాడు. వెళ్తూనే వెయిటింగ్ రూంలోంచి అప్పుడే వస్తున్న ఆ టెండర్ని ఢీకొన్నాడు. తూలి నిలదొక్కుకున్నాడు. ఆ టెండర్ నొచ్చుకుంటూ

చూశాడు. అతనికి ఇరవై ఏళ్ళుంటాయి.

"క్షమించాలి సార్. మాఫ్ కర్ దేనా...."

లాల్ తలూపాడు. "నీతో మాట్లాడాలి పేరేమిటి?"

"నాగరాజ్ సార్, ఏం మాట్లాడాలి?"

"రాత్రి డ్యూటీలో ఎవరున్నారు?"

"నేనే, సార్. పన్నెండుకి దిగిపోయాను. తిరిగి ఆరు కొచ్చాను."

"గుడ్, నువ్వు మనుషుల్ని గుర్తుపట్టగలవా?"

"మనుషుల్నా—ఎవర్ని సార్? మీరెవరు, సార్?"

"డిటెక్టివ్ ని."

"డిటెక్టివ్! డిటెక్టివ్ యుగంధర్!"

"ఎప్పుడూ ఆయన్ని కలవరిస్తూ వుంటావా?"

"ఆయన కేసులు తెగ చదివాను, సార్. మరెవరివీ అంత చదవలేదు."

"ఎందుకు?"

"ఈ స్పై హీరోలొచ్చాక సాహిత్యం చచ్చుబడి పోయింది, సార్. బుర్రకు పదును పెట్టేవి కావాలి."

"మరొకాయన — పడక్కుర్చీలో పైపు కాలుస్తూ. ఎప్పుడూ ఊసుపోక విస్కీ గ్లాసులో ఐస్ క్యూబ్స్ నింపే ఆయన తెలియదా?"

"ఎవరు సార్, ఆయన?"

"వాలి."

"తెలుసు, సార్. ఆయన్నెలా మరిచిపోతాను? ఆయన చెంపమీద కొట్టి రక్తం కక్కిస్తుంటారు...."

"గుడ్, అయితే నువ్వు చాలా గుర్తుపెట్టుకోగలవు, పద!"

లాల్ అతన్ని తీసుకొని లోపలికి నడిచాడు.

హాలులో కుడివైపు ఒక సోఫా దగ్గర నిల్చుని చూస్తున్నారు సురేష్, రేవతి ఆత్రుతగా. లాల్‌ను చూడగానే సురేష్ గబుక్కున ముందుకొచ్చాడు. లాల్ అతని భుజం తట్టాడు. "డోంట్ వర్రీ, ఇక్కడ మిమ్మల్నెవరూ కనిపెట్టడం లేదు. దార్లో ఎవరైనా వెంటాడారా?"

అతను తల అడ్డంగా వూపాడు. "లేదు, ఎవరూ వెంటాడలేదు!"

"నేను చూశాను" అంది రేవతి ముందుకొచ్చి.

ఆమె వైపు చూశాడు లాల్. పాతికేళ్ళుంటాయి. తెల్లని శరీరచ్ఛాయతో ఆకర్షణీయంగా వుంది. భుజాన పిల్లవాడున్నాడు.

అటెండర్ నాగరాజ్ ఆమెవైపే కన్నార్పకుండా చూస్తున్నాడు. లాల్ అది గమనించి, "ఏం చేశారు?" అనడిగాడు ఆమెని.

"ఒక కారు మమ్మల్ని వెంటాడి వచ్చింది!" అందామె ఉద్రేకంగా.

"ఎక్కడ్నుంచి__ఎందాక?"

"ఇంటి దగ్గర్నుంచి స్టేషన్ వరకూ వచ్చింది. మా ఆటో స్టేషన్ వైపు మలుపు తిరగ్గానే అదలాగే తిన్నగా వెళ్ళిపోయింది...."

సురేష్ అయోమయంగా చూస్తున్నాడు.

"ఏ కారది? నెంబర్ చూశారా?"

"చూశాను. యం.జి.యం. 6385. నల్ల అంబాసిడర్."

"ఏమిటి నువ్వనేది రేవతీ, నువ్వెప్పుడు చూశావు?" సురేష్ అన్నాడు అసహనంగా.

ఆమె ఉరిమి చూసింది తనివైపు. "నేను చూశాను.

కానీ మీకు చెప్పాలనిపించలేదు. లేకపోతే నడిరోడ్డు మీద గొడవచేస్తారు. అసలీ గొడవంతా మనకొద్దని చెప్పాను? వెధవ డబ్బు పోతే పోయింది! బాబు దక్కాడు చాలదా? మనకింకేం కావాలి వీడికంటే? వాడు ఫోన్‌లో హెచ్చరిక చేసినా మీరు లక్ష్య పెట్టడంలేదు. బాబు క్షేమంగా ఉండాలనుందా లేదా మీకు?"

సురేష్ ముఖం ఎర్రబడింది. "నీ పిచ్చి భయాలతో నన్ను విసిగించకు, రేవతీ! నేనేం చేస్తున్నానో నాకు తెలుసు! నీ బాబు నీ దగ్గరే లక్షణంగా వుంటాడు—"

లాల్ అన్నాడు మధ్యలో. "ఇక్కడ మనం వాదించుకోవడానికి రాలేదు. కొన్ని విషయాలు తెలుసుకోవాలి. వాళ్ళు మిమ్మల్ని వెంటాడివుంటే స్టేషన్ వరకూ వచ్చి మీ ప్రయాణాన్ని నిర్ధారించుకొని వెళ్ళిపోయివుంటారు."

"కానీ మీ ఆఫీసునుంచి ఇంటికెళ్ళినప్పుడు ఎవరూ వెంటాడలేదు!"

"సరిగ్గా చూశావా?"

"సరిగ్గా నే చూశాను, నన్నెవరూ వెంటాడలేదు!"

"కానీ మన ఆటోని ఆ కారు వెంటాడింది!" అంది రేవతి.

నాగరాజ్ ఇప్పుడా మెని ఇంకా కుతూహలంగా చూస్తున్నాడు.

లాల్ అన్నాడు శాంతంగా. "ఆల్ రైట్ మీరది చూసి వుంటే మీరు చెప్పిన వివరాలు ఉపయోగపడతాయి. ఇప్పుడసలు విషయంలోకొద్దాం...."

లాల్ ఆ మెనుంచి బాబుని తీసుకున్నాడు. అతని

బుగలు నిమిరి, మెరిసే చిన్న కళ్ళలోకి చూస్తూ, "నైస్ కిడ్!" అన్నాడు.

విశాల్ తన బుల్లి పిడికిళ్ళతో లాల్ గడ్డంమీద ఫట్—చిట్‌మని కొట్టి, చేతులు పైకి విసిరి కేరింతలు కొట్టాడు.

"నా తరేసు వాడికెవరి దగ్గరా!" సురేష్ అన్నాడు నవ్వుతూ.

రేవతి ఆందోళనగా చూడసాగింది లాల్ వైపు.

లాల్ విశాల్‌ని పరిశీలించాడు. బ్లూ షెడ్డీ, పసుపు బనియన్‌లో వున్నాడు. లాల్ నాగరాజ్‌కి అతన్ని చూపించాడు.

"చూడు, ఈ బాబుని నువ్వెప్పుడైనా చూశావా?"

అతను వెంటనే తలూపాడు. "చూశాను, సార్. ఈ బాబునీ, వీరిద్దరినీ నిన్న రాత్రి ఇక్కడే చూశాను!"

సురేష్ కలవరపడ్డాడు. రేవతి ముఖం చిట్లించింది. లాల్ విస్తుపోయి చూశాడు. "ఏమిటి నువ్వనేది?"

"అవును, సార్. సరిగ్గా అంటున్నాను. మీరిందాకా మనుషుల్ని గుర్తించాలన్నప్పట్నుంచీ అది వీళ్ళే అయుంటారని పరీక్షగా చూస్తున్నాను. వీళ్ళని ఇదివరకు చూసినట్టే అనిపించింది. వీళ్ళనిప్పుడు గుర్తుపట్టాను సార్, నిన్న రాత్రి ఇక్కడకొచ్చారు."

"ఏమిటి నువ్వనేది?" రేవతి అంది కోపంగా.

నాగరాజ్ చటుక్కున లాల్ వైపు తిరిగాడు. "అవును, సార్. నిన్న రాత్రి పదిగంటలప్పుడు ఈమె ఈ బాబు నెత్తుకొని వచ్చారు. బాబు ఇదే డ్రెస్సులో వున్నాడు. కానీ ఆమె ఆకుపచ్చ చీరలో వున్నారు. చేతిల్లో ఒక సూట్‌కేసు కూడా వుంది, ఆకుపచ్చ

రంగుది. ఆమె గబగబా లోనికొచ్చి ఇక్కడే, ఈ సోఫామీదే బాబుని పడుకోబెట్టి, సూట్ కేసు కింద పెట్టి, టాయిలెట్ లోకి వెళ్ళిపోయారు, సార్. బాబు అప్పుడు నిద్రపోతున్నాడు."

"అప్పుడు?"

"అప్పుడు కాస్సేపటికి ఈయన వచ్చారు. ఈయన ఇదే డ్రస్సులో వున్నారు. చాలా ఆందోళనగా వున్నారు. లోపలికొచ్చి అటూ ఇటూ చూసి, ఈ సోఫామీద బాబుని చూడగానే వెంటనే వచ్చి, ఎత్తుకొని, సూట్ కేసు కూడా తీసుకొని బయటికెళ్ళి పోయారు."

"అప్పుడు?"

"అప్పుడు సార్ — అదే క్షణంలో టాయిలెట్ లోంచి ఈమె వచ్చారు. వచ్చి, ఆయన వెనకనే గబగబా నడిచారు. అంతే, అలా ఇద్దరూ బయటికెళ్ళిపోయారు. అప్పుడేదో బండి వచ్చింది — అందులో వెళ్ళిపోలేదా సార్, మీరు?"

సురేష్ తికమకగా చూశాడు రేవతివైపు.

ఆమె నాగరాజ్ వైపు తిరిగి అర్చింది. "అబద్ధం! ఏమంటున్నావు నువ్వు? పిచ్చిగా వాగావంటే పళ్ళూడ గొడ్తాను, జాగ్రత్త!"

నాగరాజ్ గాభరాగా లాల్ వైపు తిరిగాడు. "ఇదేమిటి సార్, ఆమె నన్నెందుకు తిడుతున్నారు? మీరు మనుషుల్ని గుర్తించమన్నారు, గుర్తించారు. అది వీళ్ళే! ప్రమాణపూర్వకంగా చెప్పగలను—"

లాల్ అతన్ని జాగ్రత్తగా పంపేసి ఆమెకేసి తిరిగాడు. ఆమె తలవంచుకుంది. సురేష్ అనుమానంగా, అసహ

నంగా చూడసాగాడు.

"వెల్, ఎక్కడో పొరపాటు జరిగింది. మీరు దీన్ని గురించి ఆలోచించకండి. అసలేం జరిగిందో నేను తెలుసుకుంటాను. మీరింటికి వెళ్ళండి—"

"కానీ అటెండర్ — వాడలా ఎందుకు చెప్తాడు? వాడిమాటల్లో ఆత్మవిశ్వాసం వుంది. ఎందుకు చెప్తాడు? యెవరైనా చెప్పిస్తున్నారా?" అడిగాడు సురేష్, రేవతిని తదేకంగా చూస్తూ.

"అలా కూడా జరుగవచ్చు" అన్నాడు లాల్, "నిదానంమీద అన్నీ తెలుస్తాయి, మీరు వెళ్ళండి!"

వాళ్ళు కదిలి వెళ్తూంటే లాల్ సాలోచనగా చూడసాగాడు ఆమెని.

4

మధ్యాహ్నం రెండు గంటలకి తిరిగి వచ్చాడు జాన్.

"సర్, మీకోసం విలువైన సమాచారం తెచ్చాను."

"ముందు తిన్నగా మాట్లాడు నువ్వు!" అరిచాడు

"ఓ.కే. పార్టనర్, ఓ.కే!" జాన్ కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు తాపీగా. "నువ్వరిచి గొంతు పాడు చేసుకోకు, జంతువులు అరుస్తాయి. ఆల్‌రైట్ కోఠి బస్ టెర్మినస్. అక్కడి కెళ్ళమన్నావు. నువ్వన్నట్టు నెంబర్ వన్ అక్కడ మనీ కలెక్ట్ చేసుకొని, అది సరిగా వుంటే అప్పుడు నెంబర్ టూకి ఫోన్ చేయాలి. కనుక అతనెక్కువ దూరం పోకుండా ఆ సమీపంనుంచే ఫోన్ చేస్తాడు తక్షణం. కానీ ఆ సమయంలో — రాత్రి పదిగంటల వేళలో—అక్కడ షాపులూ, హోటళ్లూ అన్నీ మూసివుంటాయి. కనుక అతను ఫోన్ చేయడానికి ఇక ఒక్కటే చోటుంది—"

"ఏమిటది?"

"టెలిగ్రాఫ్ ఆఫీసు, మెడికల్ కాలేజి ప్రక్కన అక్కడ్నుంచి మాత్రమే చేయగలడు. అది వందగజాల దూరంలో వుంది. రాత్రి పది గంటలవేళ అంత రష్ వుండదు. అక్కడి టెలిగ్రామ్ క్లర్క్ నిన్న రాత్రి పదీపదికి ఒక వ్యక్తి టెలిఫోన్ బాక్స్ దగ్గరికి నడిచి వెళ్ళటం చూశాడు—"

లాల్ ఉత్సాహంగా చూశాడు, "వెల్?"

"ఆ మనిషి చామన ఛాయ రంగులో వున్నాడు. తెల్లటి డ్రస్సు వేసుకున్నాడు. నల్లకళ్ళద్దాలు పెట్టుకున్నాడు, రాత్రి అయినప్పటికీ. రింగుల జుట్టు. అయిదూ ఎనిమిదీ ఎత్తు. మెడలో బంగారు గొలుసు, చేతిలో బ్రౌన్ బ్రీఫ్‌కేసు, అతనేదో నెంబర్ తిప్పి, కొన్ని క్షణాలు తగ్గు స్వరంలో మాట్లాడాడు తెలుగులో. తర్వాత వెంటనే వెళ్ళిపోయాడు."

"మళ్ళీ చూస్తే గుర్తుపట్టగలడా క్లర్క్?"

"ఆ భరోసా ఇచ్చాడు. అక్కడ్నుంచి నేను తిరిగి బస్ టెర్మినస్‌కి వచ్చాను. అక్కడ బుకింగ్ కౌంటర్ దగ్గర.... చూశాను. స్వీపర్ ఇంకా ఊడ్వనట్టుంది, ఇవి దొరికాయి చూడు...."

జాన్ చిన్న పొట్లం విప్పి, పసుపు రంగులో వున్న నాలుగు అట్టముక్కలు లాల్ ముందుంచాడు.

లాల్ ఆ ముక్కల్ని వరుసక్రమంలో పేర్చి, వాటి మీద అక్షరాల్ని చదవసాగాడు.

"సురేష్ చింపి పడేసినవి...." చెప్పసాగాడు జాన్. "ఈ మెసేజ్ చదువుకుని చింపేశాడు. దీనిమీద దస్తూరీ వే ఆఫ్ రైటింగ్ చూస్తే, వ్రాసిన వాడి స్వభావం

తెలుసుకోవచ్చు. అక్షరాలు వంకరటింకరగా, గజిబిజిగా దీర్ఘాలూ, కొమ్ములూ ఎగ్గొట్టి, గందరగోళంగా రాశాడు. లైన్లు ఒకదానితో ఒకటి కలిసిపోయాయి. ఇతనికి చదువు రాదన్పిస్తోంది. ఉద్యోగం లేదన్పిస్తోంది. థర్డు రేట్ థగ్‌లా వున్నాడు. అంతే, ఈ సిగరెట్ పెట్టెనిబట్టి చార్మినార్ తాగుతాడన్పిస్తోంది."

"వెరీ వెల్ జాన్, ప్రొసీడ్!"

"పార్ట్‌నర్, అక్కడ్నుంచి నేను సురేష్ ఇంటి కెళ్ళాను. ఆ కిడ్నాప్ బిజినెస్ నాకు అబ్సర్డ్‌గా తోచింది. పట్టపగలు పిల్లవాడెలా మాయమయ్యాడూ నడివీధిలోంచీ అనే డౌటు నాకొచ్చింది. కిడ్నాపర్ ఎవరూ చూడకుండా గేటు దూకి వచ్చి, బెడ్‌రూం కిటికీలోంచి బాబుని అందుకోవచ్చు. కానీ వీధిలో ఎవరి కంటబడకుండా ఎలా తీసుకుపోతాడు? అఫ్‌కోర్స్, పిల్లవాడు ఏడ్వకుండా స్ప్రేహ పోగొట్టవచ్చు. కానీ ఎత్తుకుపోతూ బయట తిరిగే జనం దృష్టినుంచి తప్పించుకోలేడు. ఒట్టి చేతులతో రావటం లేదు. పిల్లాడ్ని ఎత్తుకొని పోవడంలేదు. ఎంక్వయిరీ జరిగితే మామూలుగా నడిచే జనం ఎందరో వుంటారు. కానీ, ఆ సమయంలో పిల్లాడ్నెత్తుకు పోయినవాడు తానొక్కడే స్ఫురిస్తాడు- అప్పుడు తన ఆనవాలు వెల్లడికావటం ఎంతో సులువు!"

"అవును, అయితే మారువేషంలో వచ్చాడంటావా?"

"నో. తన సొంత ఆనవాలతోనే, సొంత వేషంలోనే అందరూ చూస్తూండగా, బిడ్డని భుజానవేసుకు వెళ్ళాడు."

"వాట్!"

"ఆ వీధిలో కతను పలుమార్లు వచ్చాడట."

"వాట్!"

"సురేష్ ఇంట్లోకి చాలా సార్లు పోతూ కనిపించాడట."

"వా...."

"పెళ్ళైపోయిందనుకుంటున్నాను, పార్ట్‌నర్. కళ్ళు పేలిపోతాయ్. ఆ వీధిలో వాళ్ళకి అతని రాకపోకలు ఇప్పుడిప్పుడే అర్థమవుతోన్నాయట. వాళ్ళంతా సురేష్ భార్య రేవతి గురించి చెడుగా అనుకుంటున్నారు...."

లాల్ ముఖం ఇంకా ఎర్రబడి వుంది. కళ్ళు మూసుకుని భారంగా వూపిరి పీల్చి వదిలాడు.

"వెల్, జాన్. నేనిలాంటిదే వూహించాను స్టేషన్‌లో. రేవతి పైకి కనిపించేటంత అమాయకురాలేం కాదు. ఆమె తనని రక్షించుకునేందుకు రాని ఫోన్ కాల్ గురించి భయపెట్టి భర్త ప్రయత్నాలు మాన్పిస్తుంది. తమని వెంటాడని కారు గుర్తుల్ని చెప్పి మనల్ని ఏమారుస్తుంది. ఆమె చాలా తెలివైనది.... నువ్వు చెప్పు, ఇంకా ఏం తెలుసుకున్నావు?"

చెప్పాడు జాన్. "ఆ కిడ్నాపర్ ఆనవాలు మన టెలిగ్రామ్ క్లర్క్ చెప్పిన మొగాడి ఆనవాలతో కలుస్తున్నాయి. సురేష్ వీధిలో అలాగే వర్ణించారు. పేరెవరికి తెలియదు. సురేష్ మనకి చెప్పినట్లు సుభాష్ నిజం పేరు అవునో కాదో మనకు తెలియదు. నిన్న సాయంత్రం నాలుగున్నరకి అతను గేటు తీసుకుని లోపలికెళ్ళాడు యెప్పటిలాగే...."

"ఆగు జాన్, అతనెంతకాలంనుంచి వస్తున్నాడట ఇంటికి?"

"సుమారు రెండు నెలలనుంచి యెక్కువగా సాయంత్రాలే వస్తాడట. వచ్చి అరగంట వుండి

వెళ్ళాడట. అయితే అతను వచ్చినప్పుడూ, వెళ్తున్నప్పుడూ కూడా ఆమె అహ్వానిస్తూగానీ, సాగనంపుతూగానీ బయటికి రాదట.

"మన ఫ్రెండ్ నిన్న అలాగే వచ్చాడు. ఇంట్లో కళ్ళుండగా చూశాడట. తర్వాత వెంటనే పిల్లాడ్నెత్తుకొస్తూ కన్పించాడు ఇంటి వెనుకనుంచి — వీధిలోకొచ్చి గబగబా వెళ్ళిపోయాడట. అలా బజారుకు తీసుకు పోతున్నాడేమో అనుకున్నారట వాళ్ళు. వీధి చివర ఏదో ఆటో ఎక్కి వుంటారు. ఆ ఆటో వివరాలు తెలియలేదు.

"బెడ్‌రూం కిటికీ దగ్గర ఈ బట్ దొరికింది— చార్మినార్ సిగరెట్, సగం కాలింది. యెవరో కిటికీ లోంచి నీళ్ళు పారబోసి వుంటారు, ఇది తడిసిపోయింది. వేలిముద్రల క్వశ్చన్ లేదు. దట్సాల్ పార్ట్‌నర్. ఇక ముందుకు సాగలేక వెనక్కొచ్చేశాను."

లాల్ సిగరెట్ వెలిగించుకున్నాడు. లేచి కిటికీ దగ్గర కెళ్ళి కిందకి చూడసాగాడు. కాస్సేపయ్యాక చెప్ప సాగాడు....

"వెల్ —ఇప్పుడు కిడ్నాపర్‌ని పట్టుకోవటం తేలిక! కిడ్నాపర్ అని ఏకవచనంలో యెందుకన్నానంటే, ఇందులో ఒక్కడే బయటి వ్యక్తి! నువ్వు చెప్పే మనిషి—సుభాష్ అనుకుందాం. మరో వ్యక్తి మనకు తెలిసిందే—మన క్లయంట్ తరఫు మనిషి. అసలిదంతా ఆమె అవసరం గడవడానికి, ఆమె సహకారంతోనే జరిగిందన్పిస్తోంది....

"పార్ట్‌నర్, ఇందులో ఆమె పాత్ర ప్రస్ఫుటంగా వుంది. ప్రవర్తన అది స్పష్టం చేస్తోంది. కాబట్టి ఆమె

ద్వారా కిడ్నాపర్ని పట్టుకోవటం కష్టం కాదంటున్నాను. కానీ మన కాన్షస్‌ని ఒప్పించటం కష్టం, జాన్ ఇది ఫ్యామిలీ కేసు. ఆమె గండం గడవడానికి పన్నాయించబడిన నకిలీ కిడ్నాప్. ఇది వెల్లడైతే ఆమె సంసారం విచ్ఛిన్నమవుతుంది. జీవితం నరకమవుతుంది. ఆఫ్టరాల్ ఆమె ఎవరు? మన క్లయింట్ భార్య. గతంలో చేసిన తప్పులకి ఇప్పుడు గుట్టుగా పరిష్కారం చెల్లించుకుంటే మన అభ్యంతరం దేనికి? ఎవరి గతంతో మనకి పనిలేదు. కావాలని మనం యెవరి క్యారెక్టర్‌ని నల్లురిలో పెట్టం. మనమిక్కడ ఆఫీసు పెట్టింది కాపురాలు చెడగొట్టడానికి కాదు——

"కాబట్టి జాన్, మనం ఈ కేసును డ్రాప్ చేస్తే మంచిదనిపిస్తోంది."

"కానీ లాల్, ఇందులో కొన్ని కలుపు ముక్కలున్నాయి."

"కలుపు ముక్కలా? ఇదెక్కడి భాష!"

"నా టర్మినాలజీ అంతే. లాల్, ఆమె యెందుకీ పని చేస్తుంది? తన గతాన్ని కప్పిపుచ్చుకోవడాని కనుకుందాం. ఎలాంటి గతం? ఆమె గతంలో చేసిన తప్పులు అనే కొటేషను ఆధారంగా ఏదో లవ్ ఎఫైర్ అనుకుందాం. అప్పుడతను యెవరవుతాడు? ఆమె లవర్. ఇప్పుడు బ్లాక్ మెయిలర్. తరచు ఆమె ఇంటికి అతని రాకపోకల్లోని అంతర్యం ఇదే ననుకుంటాను. బెదిరించి డబ్బు గుంజుతున్నాడు. ఈసారి యెక్కువ మొత్తానికి వేధించి వుంటాడు. విధిలేక ఆమె ఈ కిడ్నాప్ ఉపాయం చెప్పి వుంటుంది——ఆ మొత్తాన్ని భర్తనుంచి పొందేందుకు.

"బాగానే వుంది. అవును, అతడ్ని బ్లాక్ మెయిలర్ గా అంగీకరించవచ్చు. కానీ ఆమె ప్రేమికునిగా వూహించ లేదు, లాల్. చదువుసంధ్యలు లేని, అక్షరాలు తిన్నగా రాయలేని సన్నాసి రకాన్ని, డాక్టర్ని చేసుకోగల వనిత ఏ విధంగానూ మోహించలేదని బల్లగుద్ది చెప్ప గలను.

"కాబట్టి లాల్, అతడామె గతంలో ప్రేమికుడనే థియరీ తీసేద్దాం. ఇప్పుడు మన అపోహాలన్నీ తొలగి పోయాయి కదా, ఆమె క్యారెక్టర్ పట్ల? అటెన్షన్ ప్లీజ్, ఆమెపట్ల నీ తేలికభావాన్ని పారద్రోలు! సాను భూతి చూపించు! ఆమె కష్టాల్లో వుంది, రియల్ ట్రబుల్స్. ఈ బ్లాక్ మెయిల్ ఆమె ప్రేమ వ్యవహారం గురించి సాగటంలేదు. అసలలాంటి వ్యవహారం లేదు! మరేదో కారణంగా సాగుతోంది. అదేమంత ఆమె సంసారాన్ని విచ్ఛిన్నం చేయగలంతటిదికాదు. ఇమో షనల్ బ్లాక్ మెయిలింగ్. వూరికే భయపడుతోంది. ఇందులో మన ప్రమేయం ఆమె కేవిధంగానూ ప్రమాద కరమైనది కాదు. రహస్యంగా సంప్రదించి ఆమెనుంచి అసలు విషయం రాబట్టాలి. ఆమెను చూలాగ్గా లాగి బైటపడేయాలి. లేకపోతే నువ్వన్నట్లు ఇప్పటికే విష పురుగు చోలుస్తూన్న సురేష్ తో ఆమె జీవితం—"

ఫోన్ మోగింది.

జాన్ చటుక్కున రిసీవరెత్తాడు.

సురేష్ అన్నాడు అవతలినుంచి. "మిష్టర్ జాన్, రేవతి ఫోన్ చేసింది!"

"ఏమని?"

"వాడు మళ్ళీ ఫోన్‌లో బెదిరించాడట నన్ను చంపుతానని!"

జాన్ నవ్వుతున్నాడు. "ఇంకేమన్నాడట?"

"మేము ఊరికెళ్ళలేదనీ, స్టేషన్‌కెళ్ళి డిటెక్టివ్‌తో సహాకరించామనీ, తన హెచ్చరికను నిర్లక్ష్యం చేశామనీ. అయినా మరో అవకాశం ఇస్తున్నాననీ, ఇప్పుడు తక్షణం నేను ప్రయత్నాలు మానుకోకపోతే రాత్రి పన్నెండు గంటలకి నా హత్య జరుగుతుందనీ అన్నాడట!"

జాన్ మళ్ళీ నవ్వుతున్నాడు.

"ఫోన్‌లో నవ్వకు!" అన్నాడు లాల్.

"ఓ.కే. మిస్టర్ సురేష్, మీరిప్పుడే ప్రయత్నాలు చేయటంలేదు. కిడ్నాపర్‌ని మర్చిపోయారు. డబ్బునీ మర్చిపోయారు. ఏమిటి? మీ క్లినిక్ పనితో బిజీగా వుండండి. మమ్మల్నెప్పుడూ కాంటాక్టు చేయకండి. మేం ఏం చేయాలో ఇవతల చేసుకుంటూ పోతాం."

"అలాగే, ఆ స్టేషన్‌లో యువతి గురించి కనుక్కున్నారా?"

జాన్ తటపటాయించాడు. "ఆ యువతి .... ఆమె రాత్రి ట్రైన్‌లో వెళ్ళిపోయినట్టు తెలిసింది. అటెండర్ మిమ్మల్నీ, మీ మిసెస్‌నీ ఫాల్స్ ఐడెంటిఫికేషన్‌తో కంగారు పెట్టాడు. కొద్దిపాటి తేడాతో రూపాలు కలవవచ్చు. ఉదాహరణకి మా ఇంటి యెదురుగా అచ్చం జయసుధలాగే ఒకామె ఉంటోంది___"

"పెట్టేయ్!" అన్నాడు లాల్.

"ఓ.కే, సురేష్. మీరిక నిశ్చింతగా వుండండి" అన్నాడు జాన్, ఫోన్ పెట్టేస్తూ.

5

రాత్రి పన్నెండున్నరకి ఫోన్ అదేపనిగా మోగు తోంటే, లాల్ కు మెలకువ వచ్చి రిసీవరందుకున్నాడు.

ఇన్ స్పెక్టర్ కృష్ణన్ అన్నాడు అవతలినుంచి, "మర్డర్, మిస్టర్ లాల్."

లాల్ కి నిద్ర యెగిరిపోయింది. నిటారుగా కూర్చు న్నాడు. "ఎవరు?"

"తెలియదు. ఒంటరిగా చచ్చిపడున్నాడు ఇంట్లో. ఇందాకే రిపోర్టందింది ఈ ఇంట్లోంచి కాల్పులు వినిపిం చాయని. వచ్చి చూస్తే మర్డర్."

"ఎక్కడది?"

కృష్ణన్ అడ్రసు చెప్పాడు.

లాల్ కళ్ళు విశాలమయ్యాయి. "ఇంట్లో యెవరూ లేరా?"

"లేరు. షాట్ విన్పించిన వెంటనే యెవరో ఒకామె పారిపోతోంటే చూశారట. ఆమె గురించి ఇక్కడ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు—"

"హంతుడ్ని వర్ణించండి!"

కృష్ణన్ వర్ణిస్తోంటే లాల్ ముఖంలో రంగులు మారి పోసాగాయి.

"ఓ, గాడ్! కృష్ణన్, మేం వెంటనే వస్తున్నాం!" అని రిసీవర్ పెట్టేసి జాన్ ని లేపాడు. "లే, పార్ట్నర్. శవం పిలుస్తోంది."

జాన్ బద్ధకంగా కళ్ళు తెరిచి చూశాడు. "ఇంత రాత్రా?"

"వాటికి వేళాపాళా వుండదు. రమ్మన్నప్పుడు పోవాలి."

"ఓహ్, ఈ శవాలెప్పుడు సుఖంగా నిద్రపోనివ్వవు కదా—ఛ—మనుషులకి చావనేదే లేకపోతే యెంత సుఖంగా వుండేది మన పని!"

లాల్ పిడికిలితో ఫెడీమని అతని కడుపులో కొట్టి, వెళ్ళి బట్టలు మార్చుకోసాగాడు.

జాన్ కెవ్వున అరిచి లేచి కూర్చున్నాడు.

"కడుపులో కొట్టద్దన్నాను ఫూల్, మందు కక్కేస్తాను!"

"ముందు లేచి రాకపోతే వీపు వాయించేస్తాను!"

"ఓహ్, నువ్వెంత నియంతవి! ఈ ఫాసిస్టు పార్ట్‌నర్ నశించాలి!" అరిచాడు జాన్, అద్దంలో తన ప్రతిబింబాన్ని చూస్తూ.

లాల్ ఫోనెత్తి గబగబా ఒక నెంబర్ డయల్ చేశాడు. కానీ అటువైపునుంచి ఎంతసేపటికీ రెస్పాన్స్ లేకపోవటంతో సాలోచనగా పెట్టేశాడు.

వాళ్ళిద్దరు విద్యానగర్‌లో ఆ ఇంటికి చేరుకొనేసరికి పావుగంట పట్టింది. ఇంటిముందు జనం గుమిగూడి వున్నారు. ఒక పోలీస్ కారూ, అంబులెన్స్ ఆగి వున్నాయి. డిటెక్టివ్‌లు తమ కారు దిగి ఇంట్లోకి నడిచారు.

చిన్న కాంపౌండు ముందు గేటు, లోపల వరండా, మూడు గదులున్న ఇల్లది.

శవం ముందు గది మధ్యలో వుంది నేలమీద. వెల్లికిలా గాకుండా కొంచెం యెడమవైపు వో త్తిగిలి వుంది. నేలమీద రక్తం చిన్న మడుగు గట్టింది. శవం వొంటిమీద లుంగీ, బనియన్ మాత్రం వున్నాయి. మెళ్ళో బంగారు గొలుసు దృష్టి నాకర్షించేలా వుంది.

గుండె ప్రాంతాల గాయమైంది .... ప్రక్కనే ఒక రివాల్వర్ పడివుంది.

"ఎవరితను, మీకు తెలుసా?" కృష్ణన్ అడిగాడు లాల్ ని.

"సుభాష్...." లాల్ అన్నాడు తలూపి, "ఇతను సుభాష్ కిడ్నాపర్, బ్లాక్ మెయిలర్, బడా క్రిమినల్. ఇతని కోసం ఓ కేసులో గాలిస్తున్నాం....ఇలా తటస పడతాడనుకోలేదు. యెవరు మీరు చెప్పిన ఆ స్త్రీ, ఈ ఇంట్లోంచి పారిపోయినామె?"

కృష్ణన్ బైటకు దారితీసి అక్కడ వరండాలో ఇద్దర్ని చూపించాడు.

"వాళ్ళు చెప్తారు. వాళ్ళది వీధి చివర ఎదురెదురిళ్లు. ఆ సమయంలో బయట బాతాఖానీ వేసుకున్నారు. ఇంతలో యీ ఇంట్లోంచి షాట్, ఆ వెంటనే ఓ యువతి పారిపోతూ తమ ముందునుంచి వెళ్ళటం చూశారు...."

"ఆమె ఎలా వుంది?" లాల్ అడిగాడు వారిలో ఒకర్ని.

"ఆమె మాకు తెలుసు, సార్. చాలాసార్లు ఈ ఇంటికొచ్చింది. కానీ ఆమె యెవరో, పేరేమిటో తెలియదు. ఏం పనిమీద వచ్చేదో కూడా తెలియదు. ఇందాక మా ముందునుంచి ఉరుకులోంచే స్పష్టంగా చూశాం! ఆమె తెల్లగా వుంటుంది. పెద్ద కళ్ళు. తెల్ల చీరలో వుంది—"

"అప్పుడామె చేతిలో ఏముంది?"

"ఏమీ లేదు. ఒట్టి చేతుల్తో పరుగెత్తింది."

"ఆమె రావటం చూశారా?"

"లేదు. మేం అప్పుడే బయటకొచ్చి మాట్లాడుకుం

టున్నాం...."

లాల్, జాన్ వైపు తిరిగాడు. "నువ్విక్కడ చూసుకో! నేను ఒకచోటికి వెళ్లొస్తాను. కృష్ణన్ అడిగితే అంతా చెప్పేయ్, దాచడానికేమీ లేదు....ఆమె స్వయంగా రట్టు చేసుకుంది."

"ఓ.కే, లాల్" అన్నాడు జాన్.

6

ఆమె గేటుతీసి ఆశ్చర్యంగా చూసింది. "మీరా?"

లాల్ తలూపి పరీక్షగా చూశాడు ఆ మసకచీకట్లో ఆమెని. ఆమె తెల్ల చీరలో వుంది. ముఖంలో గాభరాతనం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. ఆమె కళ్ళలో బెదురు స్పష్టంగా అగుపిస్తోంది.

"మీవారెక్కడ?" అడిగాడు లాల్.

"నిద్రపోతున్నారు" అందామె తటపటాయిస్తూ.

"మీ బాబు?"

"నిద్రపోతున్నాడు."

"మీరేం చేస్తున్నారు?"

"నేను — నేను నిద్రపోతున్నాను." ఆమె గొంతు వణికింది, "ఇప్పుడు టైమెంతైంది? ఇంత రాత్రి మేల్కొనివుండే అలవాటు నాకు లేదు."

"సారీ, మిమ్మల్ని ఇబ్బందిపెట్టినందుకు, నేను మీ వారికోసం వచ్చాను. ఇందాక ఫోన్ చేస్తే ఎవరూ పలుకలేదు."

"ఫోన్ చేశారా?"

"అవును, కానీ మీ ఇంట్లో ఎవరూ యెత్తలేదు."

"ఫోన్ మోగలేదు. మీరెలా అంటున్నారు.... ఫోన్ రింగయితే మెలకువ రానంత మొద్దునిద్ర కాదు

నాది!"

"మీ వారిది—?"

"ఆయన—ఆయన కూడా లేస్తారు."

"మరి ఇప్పుడెందుకు లేవలేదు?"

"ఏమో తెలియదు. మీ రసలు ఫోన్ చేశారా?"

లాల్ నవ్వాడు, "చేశాను, మాడమ్. అర్ధరాత్రి వచ్చి మీతో అబద్ధాలాడే దుర్బుద్ధి నాకు లేదు. జనం అపార్థం చేసుకుంటారు. నేను ఫోన్ చేశాను. కానీ మీరు ఇంట్లో లేనందువల్లా, మీ వారు మత్తు నిద్రలో ఉండటం వల్లా రెస్పాన్స్ రాలేదు."

ఆమె ఉలిక్కిపడింది. "ఏమిటి మీరంటున్నది?"

"మీ వారిని లేపండి."

"ఆయన లేవరు."

"ఎందుకు లేవరు?"

"నాకు తెలియదంతే!"

"మీరింత నిర్లక్ష్యంగా జవాబు చెప్పలేరు!"

"నేను చెప్పనంతే!"

"సరే, మీ బాబుని ఓసారి తీసుకురండి."

"వాడెందుకు?"

"లుక్ మిసెస్ రేవతి, మీరు బెట్టు చేయకండి. మీ బాబుని తీసుకురండి, లేదా నన్ను లోపలికి రానివ్వండి. అవతల మర్డర్ జరిగింది. ఎవరనుకున్నారు? మీ బ్లాక్ మెయిలర్. చేసిందెవరనుకున్నారు? ఆ బజార్లో అంతా మీ ఆనవాలే చెప్తున్నారు. అదెలా సంభవమంటారు? మీరిక్కడ మీ వారికీ, మీ బాబుకీ నిద్రమందు కలిపిచ్చి, మీ బ్లాక్ మెయిలర్ని కలుసుకునేందుకు జారుకున్నారు. కానీ అక్కడ దేనికో పేచీపడి, అతని గుండెలో బుల్లెట్

ఇరికించి బ్రతకకుండా చేశారు. దీనికి మీరు చెప్పే జవా బేమిటి?"

ఆమె ఆవేశంతో ఊగిపోయింది. "అంతా అబద్ధం! అంతా అబద్ధం! అతనెవరో నాకు తెలీదు. నేనెక్కడికీ పోలేదు!"

లాల్ జాలిగా నవ్వాడు. "మీకన్నీ తెలుసు. మొదట్నుంచీ మీరింతే. పరిస్థితులెలా రూపుదాలిస్తే మీరలా ప్రవర్తిస్తున్నారు. మీరు నిర్దోషి అయితే నన్ను లోపలికి వెళ్ళనిచ్చి చూడనివ్వండి."

ఆమె అచేతనంగా నిలబడిపోయింది. ఏమీ పలకలేదు.

లాల్ లోపలికి నడిచాడు. ఇంట్లో కెళ్ళి బెడ్ రూంలోకి దారితీశాడు. ఆమె వెనుక వచ్చింది బేలగా. బెడ్ రూంలో సురేష్ గాఢ నిద్రలో వున్నాడు. లాల్ దగ్గరి కెళ్ళి పిలిచాడు. లేవలేదు. కుదిపాడు. కదలిక లేదు. లాల్ దృష్టి ఆ ప్రక్కనే టేబిల్ మీదున్న గాజుగ్లాసుమీద పడ్డాయి. అందులో అడుగున కొన్ని పాలు మిగిలివున్నాయి....

మరో ప్రక్క ఉయ్యాల తొట్టిలో నిద్రిస్తూన్న బాబు కన్పించాడు. లాల్ దగ్గరికి వెళ్ళి అతనికీ తండ్రి లాటి అవస్థే గమనించాడు. అప్పుడు బయటికి నడుస్తూ తలుపు దగ్గరాగిపోయాడు. అతని కళ్ళు పక్కనున్న డ్రెస్సింగ్ మిర్రర్ మీద పడ్డాయి. అందులో తన వెనుక ఆమె ప్రతిబింబం కన్పిస్తోంది. ఆమె బెడ్ దగ్గర వంగి, భర్త తలగడకింద ఏదో తోస్తోంది కంగారుగా.

లాల్ నిదానంగా తిరిగి చూశాడు.

ఆమె ఖిన్నురాలై పోయింది.

లాల్ ముందుకెళ్ళి ఆ తలగడ కింద చెయ్యిపెట్టి,

చూశాడు.

చేతిలోకి కొన్ని నోట్లు వచ్చాయి. వందరూపాయల నోట్లు. వాటిని లెక్కించాడు. తొమ్మిదున్నాయి.

"అక్కడింతే దొరికిందా?" అడిగాడామెని.

ఆమె తేరుకుంది. "నాకు దొరకడమేమిటి? అవి నా తలగడకింద వుంటే తీసి ఆయన తలగడ కింద పెడు తున్నాను...."

"కానీ, ఈ మాత్రానికే అంత కంగారుపడనవసరం లేదే?"

"అవి నా తలగడక్రింద ఎక్కడివో తెలీదు—చూసి భయపడ్డాను."

"ఫోన్ ఏది? నేను పోలీసుల్ని పిలవాలి...." లాల్ బైటికి నడిచాడు.

"ఆగండి!" ఆమె పరుగెత్తివచ్చింది, "మీరాపని చేయకండి! నామాట నమ్మండి! నేనెవర్నీ చంపలేదు! నేనెక్కడికీ పోలేదు!"

"మీకు రెండు కళ్ళు అనదగ్గ మీ భర్తా, మీ బాబు పరిస్థితి చూసి నేనలా అనుకోలేను, రేవతీ!" అన్నాడు లాల్ అలాగే నడుస్తూ. "మీ ఇంటికి ఫోన్ చేసి రెస్పాన్స్ పొందనప్పుడే, నేను వెంటనే వచ్చి ఇక్కడ ఎదురుచూస్తే, అప్పుడు తిరిగి వస్తున్న మిమ్మల్నాపి యెక్కడికెళ్ళి వస్తున్నారు, రేవతిగారూ? అని అడిగే వాడ్ని. కానీ ముందా శవం నేననుకున్నదే అవునా కాదా అన్న అనుమానంతో ముందు అక్కడికెళ్ళి పోయాను....చ్ఛ!" అతను ఫోనెత్తి డయల్ చేయ సాగాడు.

7

ఉదయం పదకొండున్నరకి వచ్చాడు, కృష్ణన్ సురేష్‌తో.

సురేష్ ముఖం పాలిపోయి వుంది. అతను ఆందోళనగా కూర్చుంటూ అన్నాడు. "మిస్టర్ లాల్, అబద్ధం! బూటకం! యెవరో ఆడుతున్న నాటకం! పన్నాగం! రేవతి ఇలాంటి పని యెప్పుడూ చేయదు!"

"కానీ పరిస్థితి అలా వుంది...."

"రేవతీ ముమ్మాటికీ ఈ హత్య చేయలేదు."

"సురేష్, మీరు మర్చిపోతున్నారు...." కృష్ణన్ అన్నాడు కల్పించుకుని. "రాత్రి మీకు నిద్రమందు ఇవ్వబడింది. అది మీరొప్పుకుంటున్నారు. అలాగే మీ బాబుకీ ఇవ్వబడింది. యెవరిచ్చారు? ఇంకెవరు, మీ మిసెస్, ఆ బ్లాక్ మెయిలర్‌ని కలుసుకునేందుకు మీకలా చేసింది. ఎప్పుడు వెళ్ళిందో తెలియదు. కానీ పన్నెండూ పదికి అక్కడ మర్డర్ జరిగింది. తిరిగి పన్నెండున్నరవరకూ ఆమె యింటికి చేరుకోలేదు. ఎలాగంటే, ఆ సమయంలో లాల్ ఫోన్ చేస్తే మీ ఇంట్లో రెస్పాన్స్ లేదు. కాబట్టి రేవతికి ఎలిబీ లేదు—"

సురేష్ అయోమయంగా చూశాడు.

"అంతే కాదు, సురేష్, మీరు కిడ్నాపర్‌కిచ్చానంటున్న డబ్బులో కొంత మీ తలగడ కింద దొరికింది లాల్‌కి, నిన్న రాత్రి. అవి తొమ్మిది వంద నోట్లు. వాటి నెంబర్లు నిన్న మీరు లాల్‌కిచ్చిన నోట్ల నెంబర్ల లిస్టులో వున్నాయి. కనుక ఆ డబ్బు బ్లాక్ మెయిలర్ దేననీ, రేవతి అతని దగ్గర్నుంచీ తెచ్చిందనీ అర్ధమవుతోంది....

ఇంకా అన్నింటికంటే ముఖ్యమయిన రుజువు,

అక్కడ హత్యాయుధం. రివాల్వర్ మీద ఆమె వేలి ముద్రలున్నాయి.

"అంతే కాదు, మిస్టర్ సురేష్, ఆమె చంపి పారి పోతోండగా ఆ వీధిలో వాళ్ళు ఒకరిద్దరు చూశారు. తర్వాత ఆమెను గుర్తుపట్టారు. ఆమెను అప్పుడే కాదు, అంతకుముందు చాలాసార్లు ఆ వీధిలోకి, ఆఇంటికి రావటం చూశారట. ఆ యింటిని సుభాష్ రెండు నెలల క్రితం అద్దెకి తీసుకున్నాడు. ఒంటరిగా ఉంటున్నాడు. రేవతి అడపాదడపా వెళ్ళి కలుసుకుంటోంది. ఆమె బ్లాక్ మెయిల్ లో చిక్కుకుంది. సురేష్, అతనెవరో ఘరానా నేరస్థుడై వుంటాడు. అతనికి సంబంధించిన ఫైలు మా దగ్గర లేదు. అతను యెక్కడివాడో ఇంకా తెలియదు."

సురేష్ మాట్లాడలేదు.

కృష్ణన్ అన్నాడు తిరిగి. "రాత్రి రేవతి అతన్ని కలుసుకుంది. మీరంతా అతను మొన్న రాత్రే సిటీ వదిలి వెళ్ళిపోయాడనుకున్నారు. కానీ ఇక్కడే వున్నాడు. మిస్టర్ సురేష్, స్టేషన్‌లో మీరు మోసిన గ్రీన్ సూట్ కేసు ఇప్పుడు సుభాష్ ఇంట్లో లేదు. మీరిచ్చిన రాన్సమ్ డబ్బూ లేదు. రేవతికి ఆ తొమ్మిదివందలే దొరికాయి. ఆమె దేనికి వెళ్ళిందో, యెందుకు కొట్లాడిందో చెప్ప టంలేదు. అసలక్కడికి వెళ్ళనే లేదంటోంది. పూర్ లయర్. ఆమె అలా బుకాయించి లాభంలేదు. సాక్షుల కథనం ప్రకారం అప్పుడామె తెల్లచీరలో వుంది. లాల్ ఇంటికెళ్ళినప్పుడు ఆ చీరలోనే వుంది. మా దగ్గర హత్యకు సంబంధించి ఆమెమీద అన్ని రుజువులూ వున్నాయి.

"రాత్రి ఆమె బ్లాక్ మెయిలర్‌తో తగాదా పడి

అతన్ని ఆతని రివాల్వర్‌తో షూట్ చేసి చంపింది. అందులో ఆ ఒక్క గుండే వుంది. ఆ గుండు ఆ రివాల్వర్ నుంచే వెలువడిందని బాలిస్టిక్ ఒపీనియన్. దాని మీద రేవతి కుడిచేతి వేలిముద్రలు అయిదూ వున్నాయి. అఫ్‌కోర్స్ హంతుడివీ ఉన్నాయనుకోండి.... కానీ రక్షించుకోలేకపోయాడు. ఇప్పుడు రేవతి రక్షించుకోలేదు మా నుంచి!"

కృష్ణన్ చేతులు చరచుకొని గర్వంగా చూశాడు. డిటెక్టివ్‌లు నిశ్శబ్దంగా వుండిపోయారు. సురేష్ ఉద్రేకంగా చూడసాగాడు. అప్పు డన్నాడు లాల్ తేరుకుని.

"రేంజి, కృష్ణన్, ఏ రేంజిలో షూట్ చేయడం జరిగింది?"

"సుమారు పదిహేను అడుగుల దూరంనుంచి...."

"అదయ్యాక రివాల్వర్ యెక్కడుంది?

"శవం ప్రక్కనే, కడుపు దగ్గర."

"రివాల్వర్ ఆమె యెక్కడ్నుంచి తీసింది?"

"అదెక్కడుందో ఆమెకు తెలిసివుండదు. హంతుడే తీసి బెదిరించి వుంటాడు. యెందుకంటే అది అతని రివాల్వర్. అప్పుడామె మీదపడి లాక్కొని—"

"అయితే ఘర్షణ జరిగిన సూచనలున్నాయా?"

"అదే....అలాంటిదేమీ లేదు."

"మరామె రివాల్వర్ లాక్కొని పదిహేను అడుగుల దూరంలో ఎలా వెళ్ళగల్గింది? అతను వెంబడించి లాక్కోవాలి కదా?"

"వెంబడించి వుండడు. స్టన్ అయిపోయి వుంటాడు. రేంజాఫ్ ఫైర్ నిబట్టి చూస్తే పదిహేను అడుగులుండగా,

ఆ గది వైశాల్యం ఎనిమిదడుగుల చదురంలోనే వుంది. కాబట్టి షూటింగ్ ఆ గదిలో జరగలేదు. రివాల్వర్ లాక్కుని పారిపోతూ బయట వరండాలోంచి షూట్ చేసి వుంటుంది. అతను గది మధ్యలో సరిగ్గా తలుపుకెదురుగా నిల్చుని వున్నాడు. అక్కడే కూలిపోయాడు. ఆమె రివాల్వర్ లోపలికి విసిరి పారిపోయింది. దాన్ని తనతో తీసుకెళ్ళకపోయినా, కనీసం వేలిముద్రలు తుడవాలన్న ఇంగితం కూడా లేకపోయిందామెకు...."

"చిత్రంగా వుంది!" అన్నాడు జాన్.

"చిత్రంకాదు, అలాటి వ్యవహారాలామెకు కొత్త. చేసిన పనికి గుండె చెదిరిపోయింది...."

లాల్ అన్నాడు. "అయితే అది క్లోజ్ షాట్ కాదంటారా? నమ్మకమేనా?"

కృష్ణన్ తలూపాడు వెంటనే. "నమ్మకమే. క్లోజ్ షాట్ అయితే అతను తొడుక్కున్న బనియన్ మీద పాయింటాఫ్ ఎంట్రీ గుండ్రంగా వుండేది. చర్మంపై కాలినమచ్చ వెడల్పుగా ఏర్పడేది. గాయంచుట్టూ కణాలు నల్లగా కమిలిపోయేవి. గన్ పౌడర్ గాయంలో ఇంకి, రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ తేలేది. ఇవేవీ లేవు."

"అయితే కృష్ణన్, అది క్లోజ్ షాట్ కాకపోతే, పదిహేను అడుగుల లాంగ్ షాట్ అయితే, గురి తప్పకుండా అంత సరిగ్గా అంత దూరంనుంచి షూట్ చేయగల ఎక్స్‌పర్టు ఎప్పుడైందామె? అదీ వెనక్కి తిరిగి పారిపోతున్నప్పుడు....? మరో షాట్ పేల్చలేదు. అందులో ఒక్కటే బుల్లెట్ వుంది. బయటివాళ్ళకి ఒక్కటే షాట్ విన్పించింది...."

కృష్ణన్ తల అడ్డంగా వూపాడు. "ఆమె నైపుణ్యారి గురించి నాకు తెలీదు. ఉన్న వాస్తవం చెప్పాను. రుజువులన్నీ అంమకు సరిపోతున్నాయి. మీరామెను అరెస్టుచేయిస్తే ఆమె నేరం చేసిందని మీరు నమ్మారను కున్నాను. ఇప్పుడామెకు అనుకూలంగా మాట్లాడు తున్నారు...."

"న్యాయం ఎటువైపుంటే ఆ వైపు మాట్లాడాలి. ఈ రేంజాఫ్ ఫైర్ నా నమ్మకాన్ని బలహీనం చేసింది. అలా జరగడం సంభవం కాదు. అంత దూరంనుంచి షూట్ చేయడం ఆమెకు సాధ్యంకాదు—"

"మరింకెవరు చేశారు?"

"అసలా రివాల్వర్ అతనిదేనా అని!"

"అంటే—?"

"ఎవరో చత్తేరాం అలా పోతూ పోతూ సరదాకి షూట్ చేసి పోలేదు కదా?"

"మీ బ్రెయిన్ చెడిపోయింది!"

"లాల్ బ్రెయిన్ చెడదు!" జాన్ అభ్యంతరం తెలిపాడు.

"అయితే ఆయన ఆ నేదానికి ఏమిటాధారం?"

"చెప్పు, లాల్."

చెప్పాడు లాల్. "సుభాష్‌ని క్రిమినల్ అంటున్నాం. కిడ్నాపర్, బ్లాక్ మెయిలర్ అంటున్నాం. కానీ అతను ఒంటరిగాడని అనలేంకదా? క్రిమినల్స్ సాధారణంగా ఒంటరి జీవితం గడపరు, ఎక్కడో యెవరో మానియాక్ అయితే తప్ప. అసోసియేట్స్ వుంటారు. సుభాష్ ఇంట్లో సూట్‌కేస్ లేదన్నారు.

దాన్ని రేవతి పట్టుకు పారిపోయిందని సాక్షులనటంలేదు కదా? మరి అదేమైంది? మిగతా డబ్బంతా ఏమైంది—"

"ఎలా?"

"ఆ రైల్వేస్టేషన్‌లో మనమనుకుంటున్న నెంబర్ టూ ఎవరో సుభాష్ అసోసియేట్ ఎందుకాకూడదు? ఫిమేల్ ఎకాంప్లీస్? ఏమిటి? అతని లవర్ రేవతి రూపంలో వచ్చి ఆమెను యెందుకు ఇంపర్సనేట్ చేయకూడదు?"

"కానీ ప్రయోజనం? ఉద్దేశ్యం? మిగతా థియరీ ఎలా కన్‌స్ట్రక్టు చేస్తారు? రివాల్వర్ మీద ఆమె వేలి ముద్రలున్నాయి...."

"వేలిముద్రలు! అవెందుకొచ్చాయ్?" అరిచాడు జాన్.

లాల్ అతన్ని వారించాడు. "ఎక్కడో కిటుకువుంది, పార్టనర్ గ్రిప్ దొరకటంలేదు. మీకింకా అక్కడేం దొరికాయి, కృష్ణన్?"

"ఇంకేమీ లేదు."

జాన్ ఉలిక్కిపడ్డాడు. "తాళంచెవి — మీకో తాళంచెవి ఇచ్చాను. అదేమైంది?"

"అది....అది .. నా దగ్గరే వుంది...."

"అది మీ ప్రాపర్టీ కాదు, తీయండి బైటికి!"

"ఎక్కడిది, జాన్?" అడిగాడు లాల్.

"అక్కడే వరండాలో దొరికింది. మామూలు నికెల్ తాళంచెవి దానిమీద హెచ్.ఎల్—3 అని అక్షరాలు చెక్కి వున్నాయి" దానికి సంబంధించిన తాళం ఆ ఇంట్లోలేదు."

"ఆ అక్షరాలు తయారుచేసిన కంపెనీ పేరా?"

"కాదు, అవి అచ్చులో లేవు. చెక్కి వున్నాయి"

కృష్ణన్ తాళంచెవి తీసి లాల్ కిచ్చాడు.

లాల్ అందుకుని చూశాడు. "ఇది హోటల్ తాళం చెవిలా వుంది. హెచ్. ఎల్—హోటలు కాదు, అలా కాదు, హోటలు లయన్—లార్క్—అలా వుండాలి పేరు. జాన్, డైరెక్టరీ తీసి రెండు పొడి అక్షరాలుగల హోటళ్ళ పేర్లు చూడు...."

జాన్ టెలిఫోన్ డైరెక్టరీ అందుకున్నాడు.

సురేష్ అందరి చర్యలు, మాటలు ఆసక్తిగా ఆలకిస్తున్నాడు.

"రేవతి గతం గురించి మీకేం తెలుసు, సురేష్?" లాల్ అడిగాడు.

"ఆమె గతం ఎలాటిదైనా నా కనవసరం. నాకు తెలిసినంతవరకు వాళ్ళెవరూ వేలెత్తి చూపలేదు. ఆమెను రక్షించుకుంటాను. ఆమెకు తల్లీదండ్రీ వున్నారు. వాళ్ళకామె ఒక్కతే సంతానం. మా ఇద్దరిదీ ఒకే ఊరు, వరంగల్. ఈ విషయం నేను వాళ్ళకెవరికీ తెలుపలేదు. ఆమె నిర్దోషి అన్న నమ్మకంతో వున్నాను. దీని కక్కువ ప్రచారం జరక్కుండా ఆమెను కాపాడుకోవాలి...."

జాన్ డైరెక్టరీలో చూస్తూ కృష్ణన్‌కు చెపుతుంటే, అతను ఒకొక్క నెంబర్‌కి ఫోన్ చేసి మాట్లాడుతున్నాడు. హోటలు లక్కీ, హోటలు లారెలు, హోటలు లిబర్టీ... హిందుస్తాన్ లాడ్జి, హారిలాడ్జి, హనుమాన్ లాడ్జి....

కృష్ణన్ ఉద్రేకపడ్డాడు. హనుమాన్ లాడ్జినుంచి వచ్చిన సమాచారం ఆసక్తిగా విని, ఫోన్ పెట్టేసి చెప్పాడు.

"మన టార్గెట్ ఇదే కావచ్చు. హనుమాన్ లాడ్జి,

జాంబాగ్. ఈ తాళంచెవి వాళ్ళు తమదేనంటున్నారు. మూడో నెంబర్ గది దట. ఆ గది నిన్న రాత్రే ఖాళీ అయిపోయిందట ...!"

లాల్ ముఖం ప్రసన్నమైంది. "వెరీ వెల్! జాన్ నువ్వెళ్ళు. ఈ టార్గెట్ ని ట్రై చేసి వాళ్ళని ట్రేస్ చెయ్. వాళ్ళు మకాం ఎక్కడ మార్చారో తెలిస్తే నాకు ఫోన్ చెయ్. కృష్ణన్ తో వస్తాను—కమాన్, మూవ్ ఫాస్ట్!"

8

జాన్ జాంబాగ్ లోని హనుమాన్ లాడ్జిముందు కారు దిగి చకచకా లోపలి కెళ్ళాడు. అదొక రెండంతస్థుల చీప్ లాడ్జి. మెయిన్ రోడ్డు మీదగాక లోపల సందులో వుంది. పరిచయ ఉపోద్ఘాతాలయ్యాక దాచుకోకుండా అంతా చెప్పేశాడు ప్రొప్రయిటర్.

అతని స్టేట్ మెంట్ ప్రకారం వారం క్రితం, అంటే మూడో తేదీన సంతోష్ కుమార్—సంధ్య అనే భార్యాభర్తలిద్దరు మూడో నెంబర్ గదిలో దిగారు. నాగపూర్ నుంచి బిజినెస్ రీత్యా వచ్చినట్లూ, వారం రోజులుంటున్నట్లూ వ్రాయించారు. అతనికి ముప్ఫైఏళ్ళు, ఆమెకు పాతికేళ్ళు. హిందీ చక్కగా మాట్లాడతారు.

వాళ్ళు బయట ఎక్కువగా తిరిగేవారు. విడివిడిగా తిరిగేవారేమో, రాకపోకల సౌకర్యం నిమిత్తం రెండు తాళంచెవులు కావాలంటే ఇవ్వటం జరిగింది. మొన్న సాయంత్రంవరకు వాళ్ళ ప్రవర్తన ఒక్కలాగే వుంది. కానీ మొన్న సాయంత్రమే మార్పు వచ్చింది....

ఆ రోజు ఒకతను వచ్చాడు వాళ్ళకోసం. భుజాన చిన్న పిల్లాడున్నాడు. ఏడాది నిండదు. బ్లూ నిక్కరు,

పసుపురంగు బనియన్‌తో వున్నాడు. ఆ పిల్లాడ్ని అతను వాళ్ళకప్పగించి వెళ్ళిపోయాడు. అతనికి ముప్ఫైవుండొచ్చు వయసు. రింగుల జుట్టు. నల్ల కళ్ళద్దాలు, మెడలో బంగారు గొలుసు. అతడా ఒక్కసారే వచ్చాడు.

ఆ రాత్రి తొమ్మిది గంటలకి ఆ పిల్లాడ్ని తీసుకొని ఆమె యెక్కడికో వెళ్ళింది. అప్పుడామె ఆకుపచ్చ చీరలో వుంది. పిల్లాడెందుకో వచ్చినప్పట్నుంచీ నిద్ర పోతూనే వున్నాడు. రెండు గంటల తర్వాత ఆమె తిరిగి వచ్చింది. అప్పుడా పిల్లవాడు లేడు. సూట్‌కేసు వుంది, ఆకు పచ్చ రంగుది.

ఆ తర్వాత నిన్న ఉదయమంతా ఎక్కడెక్కడో తిరిగి మధ్యాహ్నం ఖాళీ సూట్‌కేసుతో వచ్చారు వాళ్ళు. తీసుకెళ్ళేటప్పుడు అది చాలా బరువుగా వుంది. ఆ పగలంతా గదిలోనే వుండి, ఆమె రాత్రి పదకొండు గంటలకి యెక్కడికో బయల్దేరింది. చేతిలో హేండ్ బ్యాగ్ వుంది. ఒంటిగంటకి ఒక బ్రౌన్ కలర్ బ్రీఫ్ కేసుతో కంగారుగా తిరిగి వచ్చింది. అప్పుడు హేండ్ బ్యాగు కూడా వుంది. ఆ వెంటనే వాళ్ళు గది ఖాళీ చేసేసి వెళ్ళిపోయారు. అయితే రెండో తాళం చెవి తిరిగి ఇవ్వకుండా యెక్కడో పోయిందని చెప్పారు."

జాన్ వాళ్ళ వర్ణన కోరాడు. ఆమె పచ్చగా, తెల్లగా పెద్ద జడతో వుంటుంది. నగలేవీ లేవు. ఒక రిస్టువాచీ వుంది. అతను తెల్లగా, లావుగా ఆధునికంగా వున్నాడు. బ్రిస్టల్స్ కాలుస్తాడు. గది ఖాళీ చేసినప్పుడామె ఎర్ర చీర, ఎర్ర జాకెట్‌లో వుంది. అతను గోధుమ రంగు ప్యాంటు, నల్ల షర్టులో వున్నాడు."

జాన్ వాళ్ళ లగేజి వివరాలడిగాడు. రెండు సూట్

కేసులు__బ్లూ కలర్ ఒకటి, ఆకుపచ్చదొకటి, ఒక బ్రౌన్ కలర్ బ్రీఫ్ కేసు, ఒక హేండ్ బ్యాగు, అంతే.

ఆ గదిలో వాళ్ళేమీ వదల్లేదు. ఉదయమే ఆ గదిలో మరో పార్టీ దిగింది. జాన్ వాళ్ళెల్లా వెళ్ళారని అడిగినప్పుడు, ప్రొప్రయిటర్ కుర్రాడిని పిలిచాడు.

కుర్రాడు, ఆత్మారాం టాక్సీలో ఎక్కించానని చెప్పాడు. సందు ఎదురుగా మెయిన్ రోడ్డుమీద టాక్సీ స్టాండును చేరుకున్నాడు జాన్, ఆ కుర్రాడితో. కుర్రాడు ఆత్మారాంని చూపించాడు. జాన్ ఆత్మారాంని సమీపించాడు. బేరం కుదిరాక ఆత్మారాం చెప్పిన ప్రకారం రాత్రి వాళ్ళు టాక్సీ యెక్కి దగ్గర్లో ఏ ఊరుంటే అక్కడికి చేర్చమని అడిగారు. ఆత్మారాం పాద్ నగర్ పేరు చెప్పాడు. వాళ్ళు తీసుకెళ్ళమన్నారు, ఊరవతలే దిగిపోయి రెండొందలిచ్చారు. ఆత్మారాం కళ్ళకద్దుకున్నాడు.

కారు దూసుకుపోతూంటే జాన్ సిగరెట్ మీద సిగరెట్ తాగుతూ తీవ్రంగా ఆలోచించసాగాడు. గంట తర్వాత పాద్ నగర్ చేరుకోగానే బస్టాండు వైపు పోనిచ్చాడు. బస్టాండులో పళ్ళకొట్టు పరమేశం సమాచారం ఇచ్చాడు.

వాళ్ళు పెద్ద లగేజితో చాలా రాత్రి గడిచాక పళ్ళకొట్టువద్దకొచ్చి, చాలా పళ్ళూ అవీ కొనుక్కున్నారు. అప్పుడు దగ్గర్లో ఏయే ఊళ్ళున్నాయని అడిగితే చెప్పాడు పరమేశం, నాలుగైదు పేర్లు. అన్నిటికంటే దగ్గర్లో ఏదుందని అడిగితే 'తుమ్మట' అని చెప్పాడు పరమేశం. వాళ్ళక్కడ్నుంచి వెళ్ళిపోయారు, దారి దూరం తెలుసుకొని.

'తుమ్మట' దరిదాపులకొచ్చి దారినపోయే దానయ్యని అడిగాడు జాన్, చుట్టుపక్కల దట్టమైన చిట్టడవిగానీ తోపుగానీ వున్నాయా అని.

దక్షిణంవైపుగా వెళ్ళే పూరవతల గొర్రెలకాపరి గోపి మందలు కాసేచోట దట్టంగా చెట్లున్నాయనీ, దానికవతల మూరంగా సైతాను దిబ్బవుందనీ, చెప్పాడు అతను.

జాన్ సైతాను దిబ్బమీదే కారు నిగి కళ్ళద్దాలు తీసేశాడు. రివాల్వర్ తీసుకున్నాడు. గబగబా విశాలమైన మైదానంలోకి, ఆ చెట్లున్న ప్రాంతానికేసి మండు టెండలో నడవసాగాడు

ఇరవై గజాల దూరంలో యెవరిదో కేక విన్పించింది. బదులుగా ఎక్కడో గొర్రెలమంద అర్చింది.

జాన్ పరుగెత్తాడు, పరుగెత్తుకు వెళ్ళి ఆ చెట్ల ప్రాంతాన్ని చేరుకున్నాడు. అక్కడతనికి కన్పించిన దృశ్యం—

కింద గడ్డిలో దుప్పట్లూ దిళ్ళతో కూడిన పక్క, దానిపైన నిటారుగా కూర్చున్న ఆడా మగా మనుషులిద్దరూ వాళ్ళచుట్టూ పళ్ళూ్ాలగేజీ పాటలు వస్తూన్న ట్రాన్సిస్టర్, ఆ పక్కనే గట్టులేని సేద్యపు నీటిబావి.

జాన్ ఆమెనే రెప్పవేయకుండా చూస్తున్నాడు.

ఆమె అచ్చం రేవతిలాగే వుంది.

వాళ్ళిద్దరు లేచి జాన్ మీదికి రాబోయారు దాడికి. కానీ అతని చేతిలో రివాల్వర్ చూసి ఆగిపోయారు అక్కడే. రివాల్వర్ పేల్చే అవసరంలేకుండా, ఎటువంటి అర్భాటం లేకుండా లొంగుబాటు జరిగిపోయింది.

లాల్ తలూపాడు ఆమెను చెప్పమన్నట్లు.

ఆ గదిలో డిటెక్టివ్‌లు, ఇన్‌స్పెక్టర్ కృష్ణన్, డాక్టర్ సురేష్, అతని భార్య రేవతీ, మొదలైనవారు ఆసక్తిగా కూర్చుని వింటున్నారు.

"నా పేరు రజని...." చెప్పసాగిందామె మెల్లిగా. "రేవతి నాకంటే సంవత్సరం పెద్దది. సుభాష్ మా ఇద్దరికంటే పెద్దవాడు. నాకు రెండేళ్ళు పెద్ద. మేం ముగ్గురం తోబుట్టువులం. మేం విడిపోయి చాలా కాలమైంది. అప్పుడు మేము ఖమ్మంలో వుండేవాళ్ళం.

కానీ అన్నయ్యకూ నాకూ చదువులమీద శ్రద్ధ వుండేది కాదు. మేమెప్పుడూ ఉద్యమాలూ విప్లవాలంటూ తిరిగేవాళ్ళం. రేవతి మాత్రం శ్రద్ధగా చదువుకునేది. ఆమె చాలా రిజర్వ్‌డుగా వుండేది మా వ్యవహారాల్లో—యితర విషయాల్లో అసలు ఆసక్తి చూపేది కాదు....

అప్పుడు హైస్కూలు ఎలక్షన్లు పెట్టారు. అన్నయ్య పదో తరగతిలో వున్నాడు. మేం తొమ్మిదిలో వున్నాం. ఆ ఎలక్షన్‌లలో అన్నయ్య కూడా నిలబడ్డాడు, ప్రెసిడెంటుకి. అవతలి వర్గంనుంచి కిషన్ అనే అతను నిలబడ్డాడు. మొదట్నుంచీ బద్ధవైరం వుండేది ఇద్దరికీ. ఎన్నికల ప్రచారం చేసుకుంటూ వాళ్ళిద్దరి వర్గాలూ ఘర్షణపడి పరిస్థితి అదుపు తప్పింది. అన్నయ్యవాళ్ళు కిషన్‌ని పొడిచి చంపేశారు, సుందర్ టాకీసు ఎదురుగా. తర్వాత పోలీసులకి లొంగిపోయారు.

కానీ బెయిల్ మీద విడుదలైవస్తే వాళ్ళ పని పట్టడానికి సిద్ధంగా వున్నారు కిషన్ పార్టీ వాళ్ళు. అందుకని

అన్నయ్యవాళ్ళు — మొత్తం అయిదుగురు — బయటికి రాగానే రాత్రికి రాత్రి ఊరొదిలి పారిపోయారు. ప్రిలిమినరీ హియరింగ్ కి వాళ్ళకోసం వారంట్లు వెళ్ళాయి. కానీ వాళ్ళెక్కడా దొరకలేదు. ఇప్పటికి ఆ కేసు అలాగే వుంది...."

క్షణమాగి అందామె. "అలా ఒక సంవత్సరం గడిచిపోయింది. అన్నయ్య దూరమైనా నా ధోరణిలో మార్పు రాలేదు. నా భావాలు మరింత పెరిగాయి. నాన్న మా యిద్దర్నీ యెంత అసహ్యించుకునేవాడో నాకు తెలుసు. చాలాసార్లు మమ్మల్ని నచ్చజెప్పి, వారించి చూశాడు. చివరికి మేము దారి మార్చుకోమని తెలుసుకొని, మా గురించి ఆలోచించటం మానేసి అసహ్యం పెంచుకున్నాడు.

ఆ రోజుల్లోనే నాకు ఖాదర్ అనే అతను పరిచయమయ్యాడు. అప్పుడు మేము పదో తరగతిలో వున్నాం. అతనికి ఉర్దూ రాకపోయినా తెలుగులో మంచి కవిత్వం రాసేవాడు. విప్లవకవులతో సంబంధాలుండేవి. అతని స్నేహంలో అతనివీ నావీ భావాలూ ఆశయాలూ ఒక్కటే అని తెలుసుకోవటంతో, మేమిద్దరం ఒకటిగా కలిసిపోయాం. నేనతని పార్టీలో చేరిపోయాను.

అప్పుడు మిమ్మల్ని అంతా వ్యతిరేకించారు. ఉగ్రవాదులన్నారు. నక్సలైట్లన్నారు. ఇంకేదో అన్నారు. కారణంలేకుండానే మా కార్యాలయంమీద దాడిచేసి పోలీసులు మమ్మల్ని కొట్టేవారు. లాకప్ లో పెట్టేవారు. ఆ బాధలు పడలేక మేము అజ్ఞాతవాసంలోకి వెళ్ళాలనుకున్నాం.... అజ్ఞాతంగా వుంటూ మా కలాపాలు సాగించాలనుకున్నాం. అడవుల్లోకి వెళ్ళిపోయాం.

అలా వెళ్ళిపోయిన కొంత కాలానికి ఊళ్ళో ఒక హత్య జరిగింది. ఆ అధికార పార్టీ నాయకుని హత్యకు పోలీసులు మమ్మల్ని నిందించి, ఎలాగో వెతికి పట్టుకుని, ఖాదర్‌నీ మరో ముగ్గుర్నీ కాల్చిపారేసి ఎన్‌కౌంటర్ అని ప్రచారం చేశారు. నేనూ విక్టర్ అనే అతను మాత్రం ఎలాగో తప్పించుకోగలిగాం—"

నేనా రాత్రి ఖమ్మంకి దగ్గర్లో చెర్వుపల్లి అనే ఊళ్ళో సత్యవతి ఇంట్లో తలదాచుకున్నాను. ఆమె నాతోపాటు చదువుకునేది. సైకిలుమీద రోజూ ఖమ్మం వచ్చేది స్కూలుకి. ఆమె నన్ను చూసి ఉద్రేకపడింది. ఒక ఉత్తరం తెచ్చి, చాలా రోజుల క్రితం నాకది స్కూలు అడ్రసుకొచ్చినట్లూ, తను తీసి దాచినట్లూ చెప్పి ఇచ్చింది. విప్పిచూస్తే అది అన్నయ్య వ్రాసింది.

"ఎక్కడ్నుంచి? ఏమని?"

"గుజరాత్ నుంచి రాశాడు. అక్కడ సౌరాష్ట్ర అనే చోట స్థిరపడ్డాడట. నన్నక్కడికొచ్చేయమని రాశాడు! నేనాలోచించాను. ఇక్కడ నాకు భవిష్యత్తు లేదనిపించింది. మా పార్టీ విచ్ఛిన్నమైంది. కొత్త పార్టీని కూడ కట్టుకోవటం కష్టం. ప్రభుత్వం తీవ్రంగా, అవసరమైతే దౌర్జన్యంగా అణచివేస్తోంది... ప్రాణాలతో చెలగాటం. నేనొక్కదాన్ని ఏమీ చేయలేను. నా కన్నయ్య దగ్గరే రక్షణా భవిష్యత్తూ ఉంటుందనిపించింది. సత్యవతి దగ్గర డబ్బులడుక్కుని మర్నాడే ప్రయాణమయ్యాను.

అక్కడ అన్నయ్యని చూసి నాకు చాలా సంతోషమేసింది ...దర్జాగా, నిశ్చింతగా బ్రతుకుతున్నాడు. ఆ బ్రతుకేమిటో నాకు తర్వాత్తర్వాత అర్థమైంది.... చాలా సార్లు నన్ను దుబాయ్‌వంటి చోట్లకి తీసుకెళ్ళాడు పడవల

మీద.

ఆ ప్రాంతాల నారాయణ్ సేట్ అనే అతను పెద్ద స్మగ్లరు. అతనికింద పనిచేస్తున్నాడు. సేట్ నన్నూ తమలో చేర్చుకున్నాడు. అప్పుడే నాకు తమకోసం బ్రతకటంలో, ఇతరులకోసం బ్రతకటంలో తేడా తెలిసి వచ్చింది....గత జీవితం పరమ చేదుగా తోచింది. అప్పుడు మా ఆశయాలు యెవరికీ పట్టలేదు. మా త్యాగాలు ఎవరికీ లెక్కలేదు. సానుభూతి యెవరికీ లేదు మామీద. ఆ జీవితం కుక్కలకన్నా హీనం!

ఈ ఎనిమిదేళ్ళూ నేను స్వర్గసౌఖ్యాలనుభవించాను. నాకు నచ్చినవాడ్ని ఎన్నుకున్నాను. అరిష్టాలు ఎదుర్కోక తప్పలేదు. పోలీసులతో అక్కడా అనేకసార్లు తల పడ్డాం. తృటిలో ప్రాణాలు దక్కించుకున్నాం.

కానీ ఈసారి—ఈమధ్యే రెండు నెలల క్రితం వాళ్ళ ధాటికి తట్టుకోలేకపోయాం. మా నారాయణ్ సేట్ సైతం వాళ్ళనెదుర్కోలేక చివరికి లొంగిపోయాడు. మేం చిన్నచిన్న వాళ్ళమంతా కట్టుబట్టలతో యెక్కడివాళ్ళక్కడ పారిపోయాం! నారాయణ్ సేట్ ఆర్గనైజేషన్ పూర్తిగా మట్టుబెట్టబడిందిప్పుడు...."

"అయితే?" లాల్ అన్నాడు.

"అందుకని మేము పారిపోయి వచ్చేశాం, నేనూ అన్నయ్యా రాకేష్. నారాయణ్ సేట్ మనుషులకోసం నార్త్ అంతా వలపన్నారు పోలీసులు. అతను మమ్మల్ని లొంగిపొమ్మని పిలుపు కూడా ఇచ్చాడు. కానీ మాలో కొందరికి అది ఇష్టంలేదు. కొందరు లొంగిపోయారు కూడా, మేము నార్త్‌లో ఉండకూడదని ఇక్కడ సౌత్ కొచ్చేశాం. ఇక్కడైతే కొంత క్షేమంగా వుంటుంది....

మరికొందరు నా ద్వారాలో నే బొంబాయిలోనూ, ఢిల్లీలోనూ తలదాచుకుంటున్నారు. మాకు బాగా సన్నిహితమైన రంగరాజన్ ఢిల్లీలోనే వుంటున్నాడు.

ఇక్కడకొచ్చాక అన్నయ్య ఒక యిల్లు అద్దెకు తీసుకొన్నాడు, విద్యానగర్‌లో. కానీ మా కక్కడ ఉండబుద్ధి కాలేదు. మేము హోటల్స్‌లోనే వుంటూ వచ్చాం. ఏ హోటలులోనూ వారంకంటే యెక్కువ ఉండకుండా గడిపాం. అన్నయ్య మాత్రం ఆ ఇంట్లోనే ఒంటరిగా ఉంటున్నాడు. నేనే అప్పుడప్పుడు వెళ్ళివస్తూంటే దాన్ని.

మేమక్కడ యేమీ చేయకూడదని నిశ్చయించుకున్నాం. పొరపాటున యెందులోనైనా పట్టుపడితే చాలా ప్రమాదం. కొన్నాళ్ళిక్కడే గుట్టుగా గడిపి, అప్పుడు పోలీసు వేట తగ్గాక తిరిగి అక్కడికెళ్ళి మామూలుగా రంగంలో దిగిపోవాలనుకున్నాం. మా దగ్గర చాలినంత డబ్బు లేకపోయినా అలాగే వుండాలనుకున్నాం.

అప్పుడు — ఒక రోజు అన్నయ్య మా దగ్గరకొచ్చి ఒక ఆశ్చర్యకర విషయం చెప్పాడు. క్రింతటి రోజు సాయంత్రం చిక్కడపల్లిలో ఏదో సినిమాకి వెళ్లాడట. అక్కడ నాలాగే ఒకామెని చూసి కలవరపడ్డాడట. నేనే అనుకుని పలకరించబోయాడట. కానీ ఆమె భర్తతో, బిడ్డతో స్కూటరుమీద రావడంవల్ల తను పొరబడ్డానని తెలుసుకున్నాడట.

కానీ సినిమా చూస్తున్నంతసేపూ ఆమె గురించే ఆలోచించాడట. అప్పుడు యెనిమిదేళ్ళ క్రితం తనకు మరో చెల్లెలుండేదన్న సంగతి గుర్తొచ్చిందట. మేమిద్దరం కవలలంగాకపోయినా, మాకు చాలా దగ్గర పోలికలున్న

విషయం తట్టిందట. ఇన్నాళ్ళూ రేవతి యెందుకు గుర్తుకు రాలేదా అని బాధపడ్డాడట. ఆమే ఈమె కాదు కదా అని అనుమానించాడట. అప్పుడు సినిమా వదిలాక వెంబడించి ఇల్లు కనుక్కున్నాడట.

ఆ రాత్రి ఇంటికొచ్చేసి మర్నాడు ఉదయం వెళ్ళాడట, భర్తలేని సమయంలో. ఆమె అతన్ని చూసి, గుర్తుపట్టి, బెదిరిపోయిందట! భయంతో అరవబోతే అన్నయ్య నచ్చజెప్పి శాంతపర్చాడట. కానీ ఆమె వెంటనే వెళ్ళిపొమ్మని అర్చిందట. తన దగ్గరకి ఆ ఛాయలకి రావద్దని వాదించిందట. తనకూ అతనికీ యే సంబంధమూ లేదందిట—

అన్నయ్య బతిమాలుకుని ఆమెను కూర్చోబెట్టి, నెమ్మదిగా ఇంటి విషయాలన్నీ అడిగాడట. నేనూ అన్నయ్యా వెళ్ళిపోయాక నాన్న అక్కడ ఖమ్మంలో తలెత్తుకోలేక పోయాడట. నల్గురూ నాలుగు అనుకోసాగారట. రేవతినీ తేలిక చూపు చూసేవారట. నాన్న అక్కడ ఉండదల్చుకోక, రేవతి భవిష్యత్తు కోసం ఆ ఊరు విడిచిపెట్టేశారట. వచ్చి వరంగల్లో స్థిరపడ్డారట. అక్కడ ఆమె ఒక్కర్తే కూతురని చెప్పుకునేవారట. మా విషయం యెక్కడా బయటపడకుండా జాగ్రత్తపడ్డారట—లేకపోతే రేవతి పెళ్ళి కష్టమవుతుంది.

అలా మా గురించి దాచిపెట్టి యెలాగో ఆమె పెళ్ళి అయిందనిపించారట. అందరూ సుఖంగా వున్నారట. ఇదంతా చెప్పుకొచ్చి, ఇప్పుడీ నిజం బైటపడితే తన బ్రతుకు నరకమవుతుందని ఏడ్చిందట. మోసం ద్వారా ఈ పెళ్ళి జరిపించారని భర్తా, భర్త తరపు వాళ్ళూ

గొడవచేస్తే, తెగ తెంపులు చేసుకుంటే, తన గతేం కావాలనిపించిందట. అన్నయ్య అలా జరగదని మాటిచ్చాడట.

ఇదంతా విని నేనూ చలించాను. అక్కయ్యను వెంటనే కలవాలనుకున్నాను. కానీ యెందుకో ముఖం చూపించలేనన్పించింది .... ఆమె యెంత అసహ్యించుకుంటోందో! · ఆమెకు చెల్లెలిగా నేను తగనన్పించింది. ఆమె జోలికె పోకుండా ఆమె అదృష్టానికి ఆమెని వదిలేయాలనుకున్నాను. కానీ పరిస్థితులు ఒప్పుకోలేదు.”

“ఏం జరిగింది?”

“మా దగ్గర డబ్బు అయిపోవచ్చింది. పుట్టే మార్గాలు లేవు. రంగరాజన్ కి ఉత్తరం వ్రాస్తే తనూ ఇదే పరిస్థితిలో వున్నట్లు రాశాడు. అప్పుడు రేవతి గుర్తొచ్చింది. అన్నయ్యే చెప్పాడు, ఆమెనుంచి ఒకవిధంగా డబ్బు పొందవచ్చునని. ఆ రోజే వెళ్ళి రెండొందలు పట్టుకొచ్చాడు. అప్పట్నుంచీ అవసరమైనప్పుడల్లా వెళ్ళి రెండు మూడొందలు తెచ్చేవాడు, ఆమె బలహీనత ఆధారంగా బెదిరించి. ఇలా రోజులు గడిచిపోతున్నాయి....

ఇంతలో రంగరాజన్ ఢిల్లీనుంచి ఉత్తరం వ్రాశాడు. తనకి అనుకోకుండా కొంత మొత్తంలో ‘సరుకు’ లభ్యమైందనీ, తానిక ఇంటికిపోతున్నాననీ, అయితే అంత సరుకు తానొక్కడు వదిలించుకోలేననీ, అందులో కొంత దార్లో ఇక్కడ మాకు అప్పగించి వెళ్తాననీ, అందుకవసరమయ్యే పార్టీలని చూసుకోమనీ, పది శాతం కమీషన్ ఇస్తాననీ వ్రాశాడు. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ అన్నయ్య ఇంటినుంచే సాగేవి. ఎప్పటికప్పుడు చింపేసేడు.

ఈ వార్త విని మేం సంతోషించాం. వెంటనే పార్టీల వేటలో పడ్డాం. ఈ వారమంతా ఈ పనిమీదే తిరిగాం. యెలాగైతేనేం ముగ్గురు పార్టీలని పట్టాం, పాత సిటీలో. అయితే రంగరాజన్ యెప్పుడొచ్చేదీ తెలియదు. వచ్చేముందు టెలిగ్రాం ఇస్తానన్నాడు. ఆ బండికి అప్పుడు స్టేషన్‌లో యెదురుచూడమన్నాడు. అక్కడే అప్పజెప్పి మద్రాసు వెళ్ళిపోతానన్నాడు— పాతిక కిలోల చరస్.

ఇలా ఎదురుచూస్తోంటే మళ్ళీ మా దగ్గర డబ్బు అయిపోవచ్చింది. అన్నయ్య రేవతి దగ్గర హాజరువేశాడు. ఆమె ఇక ఇవ్వలేనని కచ్చితంగా చెప్పేసిందట. భర్తకి తెలియకుండా ఇప్పటికే చాలా ఇచ్చాననీ, ఇహ వల్ల కాదని మొండిగా చెప్పేసిందట. అన్నయ్య పర్యవసానం హెచ్చరించిందట. ఆమె కాళ్ళు పట్టుకుందట. అప్పుడు ఇలా లాభంలేదని అన్నయ్య ఆ భర్తనుంచే నేరుగా చాలా మొత్తం రాబట్టేందుకు ఈ కిడ్నాపింగ్ ప్లాను వేశాడు.

బాలుని కిడ్నాప్ చేసి అన్నయ్య బాబుని హోటల్లో మాకప్పగించి ఇంటికెళ్తే, పక్కింటాయన టెలిగ్రాం వచ్చినట్లు చెప్పాడట. అన్నయ్య పోస్టాఫీసుకెళ్ళి తీసుకున్నాడట. ఆ రాత్రి తొమ్మిదిన్నరకి వస్తున్నట్లు రంగరాజనే ఇచ్చాడు! వెంటనే మేము కిడ్నాప్ ప్లాను సెటప్ చేసుకున్నాం. బాబు యెక్కడ దొరుకుతాడో సురేష్‌కు ముందు చెప్పలేదు. మేమూ నిర్ణయించుకోలేదు. టెలిగ్రాం వచ్చాక అనుకున్నాం — రైల్వేస్టేషన్‌లో అయితే బాగుంటుందని, ఒకే సమయంలో రెండు పనులూ ఒకేసారి జరుగుతాయి.

రంగరాజన్ నుంచి సరుకు తీసుకుని, బాబుతో పాటు వెయిటింగ్ రూంలో పెట్టేస్తే, సురేష్ వచ్చి వాటిని తీసుకెళ్ళునప్పుడు ఆయన వెనుక నేను భార్యలా నడిచి వెళ్తే ఎవరికీ అనుమానం రాదు. అనుకున్న ప్రకారం అలా జరిగిపోయింది. నే నా సూట్ కేసుతో హోటలుకొచ్చేశాను. మర్నాడు వెళ్ళి పార్టీలకి అందించాం. డబ్బు చేసుకున్నాం. మాక్కొంత నిమిత్తం చిక్కింది. ఆ కిడ్నాప్ డబ్బు బ్రీఫ్ కేసులో అన్నయ్య దగ్గరే వుంది...."

"అయితే యెక్కడ వచ్చింది తగాదా?"

"తగాదా రాలేదు!" అడ్డంగా తలూపిందామె, "నిన్న రాత్రి నేను అన్నయ్యని కలుసుకోవడానికి వెళ్ళాను. అప్పుడు పన్నెండవుతోంది. నా బ్యాగులో రివాల్వర్ వుంది. దాన్ని బయటకెళ్ళినప్పుడు ఉంచుకుంటున్నాను. ఇక్కడి పరిస్థితులతో నాకు బొత్తిగా పరిచయం లేదు. మా ముగ్గురికీ కలిపి ఒకటే రివాల్వర్ వున్నా, అది నా దగ్గరే యెక్కువగా వుంటోంది.

నేనింట్లోకి వచ్చానో లేదో, లోపల్నుంచి మాటలు విన్పించాయి—పక్కనుకు తప్పుకుని కిటికీలోంచి చూశాను. అన్నయ్య రేవతి మాట్లాడుకుంటున్నారు ముందు గదిలో నిలబడి! ఆమె ఉద్రేకంతో ఉందప్పుడు. అన్నయ్యని హెచ్చరిస్తోంది వెంటనే ఊరొదిలి పారిపొమ్మంటోంది.

భర్త డిటెక్టివ్ల సహాయం కోరాడట. వాళ్ళు తీవ్రంగా గాలిస్తున్నారట. తను చేతనైనంత వరకూ మాన్పించే ప్రయత్నాలు చేసిందట. కానీ లాభంలేక పోయిందట. ఇంకా ఆ నోట్ల నెంబర్లన్నీ భర్త వ్రాసుకుని డిటెక్టివ్ల కందించాడట! అన్నయ్య ఆనవాలు కూడా

వాళ్ళకి తెలిసిపోయిందట! పైగా డిటెక్టివ్‌లు తననీ అనుమానిస్తున్నారట! తనని నిలదీస్తే ధైర్యం కోల్పోయి ఏ క్షణంలో ఏం చెప్పేస్తుందో తనకే తెలియదట! తన క్షేమం కోరి వెంటనే ఇక్కడ్నుంచి పారిపొమ్మని వేడుకుంటోంది...

నిజంగా అప్పుడామె పరిస్థితి అలాగే వుంది. ఆ పరిస్థితిలో ఆమె ఇంటికి తిరిగి వెళ్తే, అక్కడెవరైనా పట్టుకుని నిలదీస్తే — మా పని అయిపోతుంది. పైగా డిటెక్టివ్‌లా మెను అనుమానంతో కనిపెడుతోంటే, వెంటాడి ఆ ప్రాంతాలకి రావచ్చు. ఈ ట్రాప్ నన్ను బెదరగొట్టింది! ఆ క్షణంలో నేనేం చేస్తున్నానో తెలీదు! కానీ రేవతి బ్రతకకూడదు. ఆమె బ్రతికివుంటే, మా గురించి అంతా చెప్పేస్తే, మేం పట్టుబడడం ఖాయం! మాకు వ్యవధిలేదు. అన్నయ్యని అప్పుడు శాశ్వతంగా మూసేస్తారు కిషన్ హత్య కేసుతో!"

"అందుకని ఏం చేశావ్?"

"రివాల్వర్ గురిపెట్టి రేవతిమీదికి కాల్చాను. అప్పుడు వాళ్ళిద్దరు యెదురెదురుగా వున్నారు. రేవతి వీపు నావైపువుంది. గుండు ఆమె వీపులోకి దూసుకుపోయేదే— కాని ఏ శక్తి ఆమెని కాపాడిందో—ఆ క్షణంలో ఆమె లీలా మాత్రంగా పక్కకు తొలగింది! అంతే, నేను నాలుక కరచుకునేంతలో గుండు దూసుకెళ్ళి అన్నయ్య గుండెలో దూరింది!"

ఆమె ఉద్రేకంగా అంది చివరి మాటలు. రేవతి ఉలిక్కిపడి సబ్బురాలై పోయింది. సురేష్ అభయమిస్తూ ఆమె భుజంపై చేయి వేశాడు. డిటెక్టివ్‌లూ, కృష్ణన్ ఒక్క క్షణం ఒకర్నొకరు చూసుకున్నారు.

అప్పుడన్నాడు లాల్. "ఆ తర్వాత."

ఆమె గుటక వేసింది. "జరిగింది చూసి నేను అదిరి పోయాను! అయినా నా పట్టుదల పోలేదు! మరోసారి ట్రిగర్ లాగాను. కానీ పేలలేదు! నా దురదృష్టంకొద్దీ అందులో ఒక్క గుండే వుంది! రేవతి భయపడిపోయి పరుగెత్తి వచ్చేస్తోంది. అన్నయ్య అచేతనంగా పడి పోయాడు. ఆమెను అంతం చేయలేను. ఆపలేను. బయట పోలీసులకో, డిటెక్టివ్‌లకో చిక్కుతుంది. ప్రమాదం. ఆమెను ఇరికించాలి. అంతే ఇలా ఆలోచించి పరుగెత్తు కొస్తూన్న ఆమెను అడ్డుకొని, రివాల్వర్ చేతిలో పెట్టాను శుభ్రంగా తుడిచి! ఆమె బెదిరి కింద పడేసి ఉరికింది—

అప్పుడా రివాల్వర్‌ని ఎత్తి జాగ్రత్తగా అన్నయ్య శవం దగ్గర, అతని వేలిముద్రలు కూడా అద్ది అక్కడ పడేశాను. ఆ వెంటనే డబ్బున్న బ్రీఫ్ కేసు తీసుకుని వెనుక గుమ్మంగుండా పారిపోయాను."

"తిన్నగా హోటల్‌గా?"

"కాదు. నాకో ఆలోచన వచ్చింది. మధ్యలో ఆ నోట్ల నెంబర్లు డిటెక్టివ్‌ల దగ్గరున్నాయంది. అందులో కొన్ని నోట్లు ఆమె మీద ప్లాంట్ చేస్తే, ఆమెమీద హత్యకు మంచి మోటివ్ వుంటుంది. వెంటనే వాళ్ళింటికి వెళ్ళాను. దాన్లో ఆమెని యెవరూ పట్టుకోకుంటే అవి ప్లాంట్ చేసి వెళ్ళిపోవాలనుకున్నాను. అనుకున్నట్లుగానే ఆమె క్షేమంగా యింటికి చేరింది. నేను బెడ్‌రూం కిటికీ లోంచి దూకి, ఆమె లేనిది చూసి తలగడకింద కొన్ని నోట్లు తీసి పెట్టాను."

"అప్పుడు?"

"తిన్నగా హోటలు కెళ్ళిపోయాను. అక్కడ అల వాటుగా బ్యాగులో చెయ్యిపెట్టి చూసుకుంటే తాళం చెవిలేదు! కంగారుపడ్డాను. ఎక్కడ పడిపోయింది? అప్పుడొక్కటే బలంగా తోచింది—అది ఖచ్చితంగా రివాల్వర్ తీసినప్పుడు ఆ ఇంట్లో పడిపోయి వుండాలి! అక్కడది పోలీసులకి దొరుకుతుంది—దాంతో ఇక్కడ కొచ్చారంటే—వచ్చారంటే—ఆ ఊహ భయంకరంగా తోచి తక్షణం హోటలు ఖాళీచేసేశాం!

సిటీయే వదిలిపెట్టాలనుకున్నాం. మాకోసం ప్రధాన మార్గాలూ, పెద్ద నగరాల్లో గాలిస్తారు. అందువల్ల ఏదైనా మారుమూల పల్లెల్లో తల దాచుకుంటే అంతా చల్లబడ్డాక దారిపట్టాలనుకున్నాం. మా దగ్గర చరస్ డబ్బు చాలా వుంది. దాంతో పట్టుబడితే రంగరాజన్ అన్యాయమవుతాడు...." ఆమె చెప్పడం ఆపి, ఇంకేమీ లేనట్లు చూసింది.

అందరూ భారంగా నిట్టూర్చి ఒకరొన్నొకరు చూసుకున్నారు.

"వెల్, అరెస్ట్ దెమ్" అన్నాడు లాల్, అక్కడ్నుంచి లేస్తూ.

—:ఐపోయింది:—